WWW.ninadam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం, మార్చి 12, 2025 | సంపుటి - 21 | సంచిక 175 | వెల - 7 | పేజీలు -12 + 8

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## గ్రూప్2 పరీక్ష ఫలితాలు విడుదల

**హైదరాబాద్, నినాదం:** ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

## బిజెపిలో అప్పడే కదనోత్సాహం

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయ పరిణామాలు తమకే అనుకూలమన్న భ్రమలో కమలం నేతలు ఉన్నారు.

- కాంగ్రెస్ లక్ష్యంగా రాజకీయ పోరాటం
- రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

వివరాలు 4లో..

# ఇగో నా నిజాయితీ..

## నువ్వూ నిరూపించుకో నీతి

### కాంగ్రెస్ ఆరోపణపై కౌశిక హరి సీరియస్

- తడిబట్టలతో పోచమ్మగుడిలోకి
- ఎవ్వరినీ డబ్బులు అడగలేదని ప్రమాణం
- ఇకనైనా బూడిద,మట్టీ,ఇసుక దందాలను మానుకో
- ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కు హితవు
- కోరుకంటితో కలిసి నిరసన, రోడ్డుపై బైటాయింపు

పెద్దపల్లి జిల్లా ముర్మూరు మట్టివ్యాపారులు,తమని డబ్బులు డిమాండ్ చేయలేదని నిరూపించుకోవాలని రామగుండం బీఆర్ఎస్ నేత కౌశిక హరికి సవాలు విసిరారు. రెండు రోజుల క్రితం గోదావరిఖని ప్రెస్ క్లబ్ వేదికగా తనపై చేసిన ఈ ఆరోపణను హరి సీరియస్ గా తీసుకున్నారు.ఈ మేరకు మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గల పోచమ్మ దేవాలయంలో తాను ఎవ్వరినీ ఎలాంటి డబ్బులు డిమాండ్ చేయలేదని తడిబట్టలతో ప్రమాణం చేసారు.





మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేత కౌశిక హరి

**గోదావరిఖని,మార్చి 11(నినాదం):**

కౌశిక హరి మాట్లాడుతూ దైవసాక్షిగా తన నిజాయితీ నిరూపించుకున్నానని అన్నారు. స్థానికంగా జరిగే మట్టీ,ఇసుక,బూడిద దందాల విషయంలో నీ నీతీ నిరూపించుకోవాలని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌కు సూచించారు. అంతకుముందు బిఆర్ఎస్ శ్రేణులు సమీపంలో గల బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్, ఇతర నాయకులతో కలిసి పోచమ్మ గుడికి ర్యాలీగా బయలుదేరారు. చౌరస్తాలోని రోడ్డుపై బైఠాయించి స్థానిక ఎమ్మెల్యే,ముర్మూరు మట్టి వ్యాపారులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. అనంతరం గుడి ముందే స్నానం చేసి తడి బట్టలతో పోచమ్మ ఆలయంలోనికి ప్రవేశించి సవాలుకు సమాధానం చెప్పారు కౌశిక హరి. ఆపై మీడియాతో ఆయన మాట్లాడుతూ ముర్మూరు మట్టి అక్రమ తరలింపుపై స్పాట్ లో ఉండి ప్రశ్నిస్తే దందా బయట పడుతుందనే భయంతో చోట మోటా లీడర్లతో ఎమ్మెల్యే మీడియా సమావేశం ఏర్పాటు చేయించారన్నారు. వారితో సవాలు పంపిస్తే బిఆర్ఎస్ పార్టీ నాయకుడుగా దాన్ని స్వీకరించి పోచమ్మ గుడిలోకి తడి బట్టలతో వెళ్లాలని తెలిపారు. రామగుండాన్ని దోపిడీకి గురి కానివ్వనన్నారు. అక్రమ దందాలకు పాల్పడితే ప్రశ్నించటం, ఎండగట్టడం తప్పదని హరి స్పష్టంచేసారు.



నిబంధనలకు విరుద్ధంగా ఓవర్ లోడ్ తో వెల్తున్న మట్టి లారీలు

## ఆందోళన హైరానా.. ఆగని అక్రమ రవాణా..

కోట్ల రూపాయల కుంభకోణాన్ని ఆపాలంటూ రామగుండం ప్రజలు,జిల్లా వ్యాప్తంగా పలువురు నేతలు,సామాజిక వాదులు నిరంతరం నిరసనలు చేపడుతున్నా ముర్మూరు మట్టి అక్రమ రవాణా మాత్రం ఆగటంలేదు. రాత్రీపగలూ తేడాలేకుండా అత్యంత ఓవర్ లోడ్ తో వందల లారీల్లో మట్టిని తరలిస్తూనే ఉన్నారు.ఈ తంతును గమనించిన పలువురు మైనింగ్,ఇరిగేషన్,రవాణా అధికారులపై అనేక అనుమానాలు వ్యక్తం చేస్తూ, తీవ్రంగా మండిపడుతున్నారు.



సిపితో బీఆర్ఎస్ నేతల వాగ్వాదం

## మక్కాన్ సింగ్ పద్ధతి మార్చుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్


ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని సాగిస్తున్న అక్రమ దందాలు మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే,పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ హితవుపలికారు. మానకుంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు, ప్రజా క్షేత్రంలో,అదీ ప్రభుత్వంలో ఉన్నపుడు ప్రతిపక్షాల నుండి సవాళ్లు ఎదుర్కోక తప్పదని గుర్తుచేసారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు నిజాయితీ పరులైతే గోదావరిఖని కోదండ రామాలయంలో లేదా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చర్చకు సిద్ధమా అని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో రామగుండం కార్పోరేషన్ డిప్యూటీ మేయర్ అభిషేక్ రావు,పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్ లు, బీఆర్ ఎస్ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




మాట్లాడుతున్న రామగుండం మాజీ ఎమ్మెల్యే చందర్

## మరో బాదుడుకు సిద్ధమవుతున్న కేంద్రం

### యూపిఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే యోచన



4

**న్యూఢిల్లీ, నినాదం:** యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు అందరూ అలవాటు పడ్డారు. ప్రజలు నగదు లావాదేవీలను పక్కన పెట్టారు. మోడీ పిలుపుతో అంతా ఆన్‌లైన్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి యూపీఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి.



## ఎస్ఎల్బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

2

### రోబోలను రంగంలోకి దింపిన అధికారులు

**నాగర్‌కర్నూలు, నినాదం:** ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో రెస్క్యూ ఆపరేషన్ 18వ రోజు కొనసాగుతుంది. మంగళవారం రోబోలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఇప్పటికే టన్నెల్‌లోకి అన్వీ రోబో బృందం వెళ్లింది. డేంజర్ జోన్‌లో రోబోలతో తవ్వే ప్రయత్నం చేశారు. క్యాడవర్ డాగ్స్ గుర్తించిన రెండు చోట్ల తవ్వకాలు మొదలు పెట్టారు.

2



## ఆగమైపోతున్న.. తెలంగాణ రైతన్న

- నీళ్లు లేక.. కరెంట్ రాక వ్యవసాయం అధోగతి
- మరోమారు కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్

# నేను అసెంబ్లీకి వస్తున్నా.. అంతా సిద్ధం కండి

- అసెంబ్లీలో సమస్యలపై పోరాడుదాం
- ప్రభుత్వ తీరును సహేతుకంగా ఎండగడదాం
- బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో కెసిఆర్ కీలక ఆదేశాలు



**నేనూ వస్తున్నా..మీరంతా రావాలి..** సమస్యలపై పోరాడుదాం అని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 9:30 నిమిషాలకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావాలని మాజీ సీఎం కేసీఆర్ సూచించారు. ప్రతిరోజూ అసెంబ్లీకి తప్పకుండా హాజరు కావాలని సూచించారు. అరగంట ముందుగా 9:30 కే అసెంబ్లీకి రావాలని పిలుపునిచ్చారు.

2

**హైదరాబాద్,మార్చి11(నినాదం):**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి , అసెంబ్లీలో విపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి రానున్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీలో సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశాల్లో మాట్లాడే అంశాలపై పూర్తిగా అధ్యయనం చేసి మాట్లాడాలని సూచించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. 'హామీల అమల్లో వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీఆర్ఎస్ హయాంలో చేసిన అప్పులు, సృష్టించిన ఆస్తుల గురించి సుదీర్ఘంగా వివరించాలి. పదేళ్లలో బీఆర్ఎస్ నాలుగు లక్షల కోట్ల

# నేటినుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అసెంబ్లీ పరిసరాల్లో 144 సెక్షన్ అమల్లోకి వచ్చింది.. తొలిరోజు ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి గవర్నర్ జిజిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తారు. 13న గవర్నర్ ప్రసంగంపై చర్చ ఉంటుంది. 14న హోలీ సెలవు కారణంగా అసెంబ్లీకి కూడా సెలవు ప్రకటించారు. 15న గవర్నర్ ప్రసంగానికి సిఎం రేవంత్ సమాధానం ఇస్తారు. ఎస్సీ వర్గీకరణ, బిసి బిల్లులతో పాటు అంశాలు చర్చకు రానున్నాయి.




- ఉదయం 11 గంటలకు గవర్నర్ ప్రసంగం
- అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు

2

## ప్రభుత్వాన్ని నిలదీసేలా బిఆర్ఎస్ సన్నద్ధం

**హైదరాబాద్,మార్చి11(నినాదం):**

బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు భారీగా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇకపోతే ఇప్పటికే అధికారులతో స్పీకర్ ప్రసాదరావు సమీక్షించారు. పలు సూచనలు చేశారు. కెసిఆర్ తొలిరోజు హాజరవుతారని ఇప్పటికే కెటిఆర్ సమాచారం ఇచ్చారు. అసెంబ్లీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నిరసనలు, ర్యాలీలు, ధర్నాలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఇప్పటికే అన్ని శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం, మంత్రుల సమావేశం జరిగింది. ఆయా శాఖలకు బడ్జెట్ లో నిధుల కేటాయింపుపై ప్రతిపాదనలు సమర్పించారు.



## కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

- దత్తత గ్రామంలో మంత్రి సీతక్కతో కలసి పర్యటన
- గిరిజనుల ఇంగ్లీష్ ప్రావీణ్యంపై ఆశ్చర్యం
- కొండపర్తిలో పర్యటించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

2

**ములుగు, నినాదం:** తాను దత్తత తీసుకున్న ములుగు జిల్లా కొండపర్తి గ్రామానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రోడ్డు మార్గాన చేరుకున్నారు. మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రెటరీ కిషోర్ , కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా ఘన స్వాగతం పలికారు. ఆదివాసీలు వారి నృత్యాలతో ఆకట్టుకున్నారు. కుమురం భీమ్, బిర్సా ముండా విగ్రహాలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, మంత్రి సీతక్క ఆవిష్కరించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధి నిమిత్తం రూ. కోటి 50 లక్షల విలువైన పనులు ప్రారంభించారు. మహిళల కోసం ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

- కేంద్రమంత్రి గడ్కరీ హామీ ఇచ్చారు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

**న్యూఢిల్లీ, నినాదం:**

రీజినల్ రింగ్‌రోడ్డు కు సంబంధించిన అన్ని అనుమతులు రెండు నెలల్లో ఇస్తామని, అన్ని క్లియరెన్స్‌లు వచ్చాక ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర మంత్రి గడ్కరీ హామీ ఇచ్చారని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రీజినల్ రింగ్‌రోడ్డు, హైవేల కోసం గడ్కరీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సంగారెడ్డి - భువనగిరి - చౌటుప్పల్ వరకు ఆర్ఆర్ఆర్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. దాదాపు 95శాతం భూ సేకరణ కూడా పూర్తయింది. రూ.వెయ్యి కోట్లతో 12 ఆర్వోబీలు కూడా మంజూరు చేశారు. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి ఆరు లేన్ల నిర్మాణం త్వరితగ



తిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని గడ్కరీ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మచిలీపట్నం వరకు రోడ్డు విస్తరణ ఆలస్యమవుతున్నందున.. గుడిమల్కాపూర్ నుంచి విజయవాడ వరకు ఒక ప్యాకేజీ, విజయవాడ నుంచి మచిలీపట్నం వరకు మరో ప్యాకేజీగా విభజించి టెండర్లు పిలవాలని అధికారులను ▸▸ 2లో



2

## 13 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### గద్దర్ అవార్డులపై ప్రభుత్వం కీలక ప్రకటన

**హైదరాబాద్, నినాదం:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక 'గద్దర్ అవార్డ్స్'ను ఈ ఏడాది ఉగాది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఎంట్రీలను ఆహ్వానించింది. అయితే అనుకోని కారణాల వలన ఈ వేడుక ఉగాది నుంచి ఏప్రిల్ మొదటివారంలో నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తాజాగా స్పష్టత ఇచ్చింది.

## కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

### పాత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు అనుమతి

**న్యూఢిల్లీ, నినాదం:** ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజీవ్రాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజీవ్రాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను ఆదేశించింది.

2

## ఆర్థిక బాధలతో కుటుంబం ఆత్మహత్య

- పిల్లలు ఇద్దరిని చంపి దంపుతుల ఉరి
- హైదరాబాద్ హబ్సీగుడాలో ఘటన


## రెండు బైక్‌లను ఢీకొన్న కర్నాటక బస్సు

### ఐదుగురు వ్యక్తుల దుర్మరణం




## మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

### అత్యున్నత పురస్కారంతో సత్కారం



**న్యూఢిల్లీ,మార్చి11(నినాదం):**

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి మారిషస్ దేశ అత్యున్నత పురస్కారం దక్కింది. తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది స్టార్ అండ్ కీ ఆఫ్ ది ఇండియన్ ఓషన్'ను మోదీకి ఆ దేశ ప్రధాని నవీన్ రామ్‌గులాం ప్రకటించారు. ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి భారత ప్రధానిగా మోదీ ఘనత సాధించారు. ప్రస్తుతం మారిషస్ పర్యటనలో ఉన్న మోదీ.. ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గులాం, ఆయన సతీమణి వీణా రామ్‌గులాంలకు ▸▸తరువాయి 2లో

# నేటినుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

ఈనెల 19 లేదా 20న ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈసారి మూడు లక్షల 20 వేల కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టేఅవకాశం ఉంది. మార్చి 29 వరకు అసెంబ్లీ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు ముందు తెలంగాణ భవన్‌లో కేసీఆర్ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహం పై ఎమ్మెల్యేలకు దిశా నిర్దేశం చేశారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ పై చర్చ లో ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని నిర్ణయించారు. ఆరు గ్యారెంటీలకు బ్జడెట్ కేటాయింపులపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టే విధంగా చర్చలో పాల్గొనాలని కేసీఆర్ సూచించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలిన ఘటన పై ప్రభుత్వ తప్పిదం ఉందంటూ ఎత్తి చూపాలన్నారు. కాళేశ్వరం రిపేర్ చేయక పోవడంతోనే పంటలు ఎండుతున్నాయి అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని బీఆర్ఎస్ ప్లాన్ చేస్తోంది. రాష్ట్రం లోని వివిధ అంశాలపై వాయిదా తీర్మానాలు ఇచ్చి.. వాటిపై చర్చ కు గట్టిగా పట్టు పట్టాలని ఎమ్మెల్యే లకు కేసీఆర్ సూచించారు. అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న సందర్భంగా రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని, అసెంబ్లీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. బడ్జెట్ సెషన్‌లో సరైన సమాచారం అందించేందుకు సంబంధిత కార్యదర్శులు తప్పనిసరిగా హాజరు కావాలని, శాఖల వారీగా నోడల్ అధికారులను కూడా నియమించుకోవాలని సి.ఎస్ అన్నారు. తదుపరి రోజుల్లో వివిధ శాఖల డిమాండ్లపై చర్చ జరగనున్నందున, వివిధ శాఖల వారీగా పూర్తి వివరాలతో అధికారులు సన్నద్ధం కావాలని సి.ఎస్ పేర్కొన్నారు.




## నేను అసెంబ్లీకి వస్తున్నా..అంతా సిద్ధం కండి

అప్పు చేస్తే కాంగ్రెస్ 14 నెలల్లోనే లక్షా 50 వేల కోట్ల అప్పులు చేసింది. అప్పుల విషయంలో కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టాలి. భారీగా అప్పులు చేసినా హామీలు అమలు చేయడం లేదు. రైతుబంధు, సాగునీరు ఇవ్వకుండా రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను, వారి ఆకాంక్షలను అర్థం చేసుకొని వారి గొంతుకగా బీఆర్ఎస్ సభ్యులు ఉభయ సభల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించాలి. గొర్రెల పెంపకం.. చేపల పంపిణీ సమగ్ర అమలు కోసం.. అసెంబ్లీ మండలిలో ప్రభుత్వాన్ని నిలదీయాలి. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలి. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమౌతున్న తీరుపై మాట్లాడాలి. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండిరగ్స్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలి. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని కొట్లాడాలి. ఆరు గ్యారంటీల అమలులో ప్రభుత్వం అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని నిలదీయాలి. విద్యార్థుల ఓవర్సీస్ స్కాలర్షిప్ లు విడుదలచేయక పోవడం, వైద్య రంగంలో దిగజారుతున్న ప్రమాణాలు, తదితర ప్రజా సమస్యలు ఎండగట్టాలి. దళిత బంధును నిలిపివేయడం పట్ల ప్రశ్నించాలి..‘ అని మాజీ సీఎం కేసీఆర్ సమావేశంలో తెలిపారు.





## ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో కొనసాగుతున్న ఆపరేషన్

కేరళకు చెందిన క్యాడవర్ శునకాలు మృతదేహాల ఆనవాళ్లు పసిగట్టాయి. దాంతో ఆ ప్రాంతంలో తవ్వితే ఒకరి మృతదేహం బయటకు తీశారు. అతి కష్టం మీద మరో ఐదడుగులు తవ్వారు. ఇంజనీర్ ఆచూకీని కనుగొన్న ప్రాంతానికి కొంచెం అటు ఇటుగా మరో ముగ్గురు ఉన్నట్లు అనుమానిస్తున్నారు. మరో ఇద్దరి జాడ లభించే అవకాశం ఉంది. మిగిలిన వారు సొరంగం చిట్ట చివరి భాగం దగ్గర టీబీఎం కట్టర్ సమీపంలో చిక్కుకుని ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం టన్నెల్‌లో టీబీఎం మిషన్ కట్టింగ్, డీ వాటరింగ్ కొనసాగుతుంది.శ్రీశైలం ఎడమ కాలువ ప్రాజెక్టు టన్నెల్ నిర్మాణ సమయంలో 8 మంది మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం టన్నెల్‌లో గౌరావ్ పెనిట్రేటింగ్ రాడార్ , క్యాడవర్ డాగ్స్ సాయంతో తవ్వకాలు కొనసాగుతున్నాయి. రాడార్, శునకాలు గుర్తించిన ప్రదేశాలను డీ1, డీ2, డీ3 ప్రాంతాలుగా విభజించి అక్కడ తవ్వకాలు చేపట్టారు అధికారులు. ఆదివారం నాడు డీ2 ప్రాంతంలో తవ్వకాలు జరిపిన రెస్క్యూ టీమ్స్ ఓ ఇంజనీర్ మృతదేహాన్ని వెలికితీశాయి. రెస్క్యూ ఆపరేషన్ కు అడ్డుపడుతున్న టన్నెల్ బోరింగ్ మెషిన్ కట్టింగ్, నీటి తొలగింపు పనులు కూడా నిరంతరం జరుగుతున్నాయి. కార్మికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎంతమాత్రం అలసిపోకుండా, బృందాలు ఎప్పటికప్పుడు తమపనిని చురుకుగా కొనసాగిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ , రెస్క్యూ టీమ్స్, పోలీసు విభాగం, ఫోరెన్సిక్, వైద్య బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి.

## ఆగమైపోతున్న.. తెలంగాణ రైతన్న

**హైదరాబాద్, నినాదం:**

కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆగమైపోతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. సాగుకు సరిపడా నీళ్లు లేక, విద్యుత్ కోతలతో అన్నదాత బోరున విలపిస్తున్నా పట్టించుకునే నాథులు లేరని అన్నారు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే రైతన్న తల్లడిల్లిపోతున్నాడు. ఏం చేయాలో దిక్కుతోచక కొందరు అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే.. మరికొందరు కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నారు. అన్నదాతల సమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని కేటీఆర్ అన్నారు. అలంపూర్ నుండి ఆదిలాబాద్ వరకు అశ్వారావుపేట నుండి జహీరాబాద్ వరకు వ్యవసాయం తిరోగమనం లో ఉందన్నారు. సాగునీళ్లు లేక పంటలు ఎండిపోతున్నయ్.. రైతుల గుండెలు మండిపోతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ వచ్చింది.. కరువును తెచ్చిందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ పాలనలో నడి ఎండకాలంలోనూ చెరువులు మత్తళ్లు దుంకాయని కేటీఆర్ గుర్తు చేశారు. నేడు అదే చెరువులు నీళ్లు లేక వెలవెలబోతున్నాయని మండిపడ్డారు. నాడు కాలువల నిండా నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండిరచుకునేందుకు కేసీఆర్ అండగా నిలిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను పడావు బెట్టి, నీళ్లను ఆంధ్రాకు వదిలి పంటలను ఎండబెడుతుందని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలో సమయానికి రైతుబంధు, 24 గంటల ఉచిత కరంటు, సాగునీళ్లు, విత్తనాలు, ఎరువులు, పంటల కొనుగోళ్లతో రైతు కంటినిండా నిద్ర, కడుపు నిండా సంతోషంగా ఉన్నాడని కేటీఆర్ గుర్తు చేశారు. 15 నెలల కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా రాదు, సాగునీళ్లు ఇవ్వరు, కరంటు ఇవ్వరు, విత్తనాలు దొరకవు, ఎరువులు ఉండవు, అన్ని గండాలు దాటుకుని పంటలు పండిస్తే కొనుగోళ్లు ఉండవు అని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో వ్యవసాయ అనుకూల విధానాలతో పండగలా వ్యవసాయం ఉండే అని కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో అన్నదాతపై కక్షగట్టి వ్యవసాయాన్ని ఆగంపట్టించారని మండిపడ్డారు.

## కొండపర్తి బ్రాండ్ కనిపించాలి

అగన్వాడీ కేంద్రంలో విద్యార్థులతో అక్షరాభ్యాసం చేయించారు. మహిళల కొరకు మిర్చి యూనిట్, మసాల, పసుపు, పిండి యూనిట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ మాట్లాడుతూ.. ‘ఆదివాసీలు వెనకబడి ఉన్నారు కాబట్టి అధికారులందరూ కలిసి ఈ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. ఇక్కడ పిల్లలు ఇంగ్లీష్ లో మాట్లాడం చాలా ఆనందం అనిపించింది. ఈ కొండపర్తి గ్రామాన్ని దేశంలో రోల్ మోడల్ గ్రామంగా తీర్చిదిద్దాలి. నేను ఆదివాసీ కుటుంబం నుంచి వచ్చాను. మా గ్రామం కూడా నా చిన్నప్పుడు కొండపర్తిలానే ఉండేది.కొండపర్తిలో తయారుచేసే మసాలా, కారం, పసుపు ఒక ప్రత్యేక బ్రాండ్ లు గా నిలవాలని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో రోడ్డెక్కిన
# ట్రిపుల్ ఆర్ బాధిత రైతులు

**మార్కెట్ ధరలకూ భూ పరిహారం చెల్లించాలని డిమాండ్**
**నేషనల్ హైవే అథారిటీ కార్యాలయం ముందు ధర్నా**

హైదరాబాద్ :

ట్రిపుల్ ఆర్‌లో భూములు కల్పోతున్న బాధితులు హైదరాబాద్‌లో రోడ్డెక్కారు. తమను రోడ్డున పడేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఆర్ఆర్ఆర్ బాధితులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలంటూ బంజారాహిల్స్ రోడ్ నెం 2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రిజినల్ ఆఫీస్ ముందు ధర్నాకు దిగారు. చౌటుప్పల్, భువనగిరి, గజ్వేల్ ప్రాంతాల నుంచి వచ్చిన ఆర్ఆర్ఆర్ బాధిత రైతులు తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్ విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటే ప్రభుత్వం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని...తమ భూములకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మూడేళ్ళ నుంచి న్యాయం చేయాలని అన్ని ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా ఎవరు పట్టించు కోవడం లేదని ఆర్ఆర్ఆర్ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు . మున్సిపాలిటీల మధ్యలో నుంచి కాకుండా ట్రిపుల్ ఆర్ అలైన్ మెంట్ మార్చాలని డిమాండ్ చేశారు. వరంగల్ హైవే కోసం, కాళేశ్వరం కాలువల నిర్మాణానికి, ఎలక్ట్రిసిటీ హైటెన్షన్ టవర్స్ కోసం, యాదగిరి గుట్ట రోడ్డు అభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే తమ భూములు తీసుకుందన్నారు. అభివృద్ధి పేరుతో మళ్లీ తమ భూములను లాక్కుంటే వ్యవసాయం ఎలా చేసుకోవాలని..ఎలా బతకాలని ప్రశ్నించారు. భూముల కోల్పోతున్న బాధిత రైతులకు ప్రత్యామ్నాయం చూపి..సరైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కేంద్ర, రాష్ట్ర భాగస్వామ్యంతో ట్రిపుల్ ఆర్ నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ముందుగా ప్రభుత్వం ట్రిపుల్ నార్త్ పూర్తి చేసేందుకు సిద్ధమైంది. ఇప్పటికే దీనికి సంబంధించిన భూసేకరణ పూర్తయింది. 161.518 కిలోమీటర్ల( ట్రిపుల్ ఆర్ నార్త్) రోడ్డును రూ.7104.06 కోట్లతో నిర్మిస్తున్నారు.1వ ప్యాకేజీ: గిర్మాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు 34.518 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ. 1529.19 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు మెయింటెనెన్స్ చేయాలి. 2వ ప్యాకేజీ: రెడ్డిపల్లి నుంచి ఇస్లాంపూర్ వరకు 26 కిలోమీటర్ల 4 వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1114.80 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి.3వ ప్యాకేజీ: ఇస్లాంపూర్ నుంచి ప్రజ్ఞాపూర్ వరకు 23 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1184.81 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి.4వ ప్యాకేజీ: ప్రజ్ఞపూర్ నుంచి రాయగిరి వరకు 43 కిలోమీటర్లు నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని 1728.22 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్ల మెయింటెనెన్స్ చేయాలి. 5వ ప్యాకేజీ: రాయగిరి నుంచి తంగడ్ పల్లి వరకు 35 కిలోమీటర్ల నాలుగు వరుసల గ్రీన్ ఫీల్డ్ రహదారిని రూ.1547.04 కోట్లతో రెండేండ్లలో నిర్మించాలి. ఐదేండ్లు నిర్వహించాలి ఈ క్రమంలో ఇప్పటకిఏ భూసేకరణ మొదలయ్యింది. తమకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని రైతులు హెచ్చరించారు.

### ఎన్నికల ప్రక్రియ
## ఓటర్ల జాబితాపై ఇసి స్పందన

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా జరిగే ఎన్నికల పక్రియ, ఓటర్ల జాబితాపై ప్రతిపక్షాలు కొంతకాలంగా పలు సందేహాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలోనే ఇసి దిద్దుబాటు చర్యలకు దిగింది. పార్లమెంట్‌లో కూడా సోమవారం విపక్షాలు చర్చకు పట్టుబట్టాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ప్రతిపక్షాలు దేశవ్యాప్తంగా ఓటర్ జాబితా, గుర్తింపు కార్డుల అంశంపై ప్రశ్నలు లేవనెత్తాయి. దీనిపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించి.. ఎన్నికల పక్రియను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు చేస్తోంది. దీనికి సహకరించాలంటూ రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చింది. ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల స్థాయిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని అన్ని జాతీయ, రాష్ట్ర పార్టీలకు ఈసీ సూచించింది.

# నిజామాబాద్ మార్కెట్‌కు పోటెత్తిన పసుపు

**గిట్టుబాటు ధరలు ఇవ్వడం లేదని రైతుల ఆందోళన**
**500 తగ్గించి కొనుగోలుకు వ్యాపారుల మెలిక**
**చేసేది లేక ఆమోదించిన రైతులు**

నిజామాబాద్., :

నిజామాబాద్‌లోని మార్కెట్ యార్డుకు పసుపు పోటెత్తింది. 50 వేల బస్తాలకు పైగా అమ్మకానికి పసుపు రావడంతో రైతులతో మార్కెట్ యార్డ్ మొత్తం సందడిగా మారింది. కనీస మద్దతు ధరతో కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ.. రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మార్కెట్ యార్డ్ ముట్టడిరచి అక్కడి నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ తీశారు. బస్టాండ్ ఎదుట రెండు గంటల పాటు ధర్నా చేపట్టారు. దీంతో.. నిన్న పసుపు కొనుగోళ్లు నిలిచిపోయాయి. జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో వ్యాపారులు రైతులతో జరిపిన చర్చల ముగిశాయి. కటాఫ్‌కు 500 ధర తగ్గిస్తే పసుపు యథావిధిగా కొనుగోలు చేస్తామంటూ వ్యాపారులు తేల్చిచెప్పడంతో చేసేదేమీ లేక రైతులు ఒప్పుకున్నారు. దీంతో.. క్వింటాకు 500 ధర తగ్గిస్తూ, క్వింటాల్ పసుపు 9500 రూపాయలకు కొనుగోలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్ యార్డుకు పసుపు రైతులు పోటెత్తారు. పసుపు కొనుగోళ్లపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సీజన్ ప్రారంభం నుంచి క్వింటాల్‌కు 2 వేలకు పైగా ధర పతనం అయ్యిందని పసుపు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం క్వింటాల్‌కు రూ.18000 వరకు ధర పలుకగా.. ఈసారి రూ. 10వేల లోపు కనీస ధర పలుకుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నాణ్యత వంకతో ధరలు తగ్గుతున్నాయని మార్కెట్ చైర్మన్ చెబుతుండటంపై రైతులు తప్పు పట్టారు. వ్యాపారులు, మార్కెట్ కమిటీ అధికారులు కుమ్మక్కయ్యారని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. పసుపునకు కనీస మద్దతు ధర చెల్లించాలని, దళారుల మోసాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిజామాబాద్ ప్రధాన బస్టాండ్ వద్ద పసుపు రైతులు మెరుపు ధర్నా చేపట్టారు. వరుసగా రెండోరోజూ మంగళవారం ఆందోళనకు దిగారు. పసుపు బోర్డు వచ్చినా లాభం లేకుండా పోయిందని అన్నారు. రైతులను ప్రభుత్వం మోసం చేస్తుందని, పసుపు బోర్డు పేరుతో దగా చేస్తున్నారని నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చి సమాధానం చెప్పేంతవరకు ధర్నాను విరమించబోమని మొండికేశారు.నిజామాబాద్ మార్కెట్ యార్డ్ మొత్తం దళారులు, వ్యాపారుల చేతిలో ఉందని ఆరోపించారు. రైతులకు మద్దతు ధర ఇవ్వకుండా వ్యాపారులు సిండికేట్ గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని, మార్కెట్లో వచ్చిన పసుపునకు నాణ్యత లేదని వంక చూపుతూ రైతును నిండా ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డుకు పసుపు తీసుకొచ్చి వారం రోజులు గడుస్తున్నా కూడా పసుపు కొనడం లేదని ఆరోపించారు. దిక్కుతోచని పరిస్థితుల్లో వ్యాపారులు చెప్పిన రేటుకు పసుపు విక్రయించి కన్నీటితో తిరిగి వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వందల కుప్పల పసుపు ఉన్నప్పటికీ కేవలం ఒకటి, రెండు కుప్పలను పరిశీలిస్తున్నారని, పూర్తిస్థాయిలో పసుపు పరిశీలించకుండానే నాణ్యత లేదని వంకతో కొనడానికి ఎవరు ముందుకు రావట్లేదని అన్నారు.



## రెండునెలల్లో ట్రిపుల్ ఆర్‌కు అనుమతులు

గడ్కరీ ఆదేశించారు. 62 కి.మీ మేర శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌కు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు‘ అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## గద్దర్ అవార్డులపై ప్రభుత్వం కీలక ప్రకటన

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన సంవత్సరం (2014) నుంచి 2013 వరకు ఒక్కో సినిమాకు ఉత్తమ చలన చిత్రం అవార్డును ఇవ్వబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ అవార్డుల విధివిధానాలను ఇటీవల ఖరారు చేసిన ప్రభుత్వం, మార్చి 13 నుంచి దరఖాస్తుల స్వీకరణను ప్రారంభించనున్నట్లు వెల్లడిరచింది. వేడుకలలో సినిమా నటులతో పాటు దర్శకులు, సాంకేతిక నిపుణులతో పాటు ఐక్యతను పెంపొందించే సాంస్కృతిక విద్యా, సామాజిక ఔచిత్యం, జాతీయ సమైక్యతను ప్రోత్సహించే చిత్రాలు, బాలల సినిమాలు, పర్యావరణం, హెరిటేజ్, చరిత్ర ఆధారిత చిత్రాల విభాగాల్లో ప్రభుత్వం పురస్కారాలు ఇవ్వనుంది. ఇవే కాకుండా తొలి ఫీచర్ ఫిల్మ్, యానిమేషన్ ఫిల్మ్, డాక్యుమెంటరీ, షార్ట్ ఫిల్మ్ వంటి విభాగాల్లోనూ ఈ అవార్డులను ప్రదానం చేయాలని భావిస్తోంది. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణలు రాసిన వారికి, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కూడా ఈ గౌరవాన్ని అందించనున్నారు. అలాగే తెలంగాణ సినిమా రంగంలో అసాధారణ సేవలు అందించిన పైడి జయరాజ్, కాంతారావు పేర్లతో కూడా ప్రత్యేక పురస్కారాలను అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తుంది.తెలుగు సినీ పరిశ్రమను ప్రోత్సహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులను ఇవ్వనున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. తెలుగు సినిమాపై పుస్తకాలు, విశ్లేషణాత్మక వ్యాసాలు, నటీనటులు, సాంకేతిక నిపుణులకూ ఈ అవార్డును ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పైడి జయరాజ్, కాంతారావు, ఎం.ప్రభాకర్‌రెడ్డి పేర్లతో అవార్డులు కొనసాగించాలని నిర్ణయించింది.

## మారిషస్ పర్యటనలో ప్రధాని మోడీ

’ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (ఓసీఐ)’ కార్డులు ప్రకటించారు. పర్యటనలో భాగంగా అక్కడున్న భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల క్రితం సరిగ్గా ఇదే రోజున మారిషస్‌కి వచ్చాను. అప్పటికీ హోలీకి పది రోజులే ఉంది. ఈ సారి హోలీ రంగులను నాతో పాటు భారత్‌కు తీసుకెళ్తా. ఈ ప్రాంతానికి వస్తే నా సొంత ప్రదేశంలా అనుభూతి కలుగుతుంది. మనమంతా ఒకే కుటుంబం అంటూ ప్రసంగించారు. అనంతరం.. తనను అత్యుత్తమ పురస్కారంతో సత్కరించిన మారిషస్ ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.

## కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ’ఆప్’ పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.




## ఆర్థిక బాధలతో కుటుంబం ఆత్మహత్య

హైదరాబాద్ :

అప్పుల భారం తట్టుకోలేక ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. రియల్ వ్యాపారంలో వచ్చిన అప్పులు తట్టుకోలేక ఓ వ్యక్తి పిల్లలను చంపి భార్యతో సహా తానూ ఆత్మహత్య చేసుకున్నారు. కూతురు, కుమారుడిని చంపిన అనంతరం దంపతులు ఉరేసుకున్న సంఘటన హైదరాబాద్ లోని హబ్సిగూడలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం?.. కల్వకుర్తికు చెందిన చంద్రశేఖర్ రెడ్డి(45) తన భార్య కవిత(35), కుమారుడు విశ్వాన్ రెడ్డి(14), కుమార్తె శ్రీతరెడ్డి(15)లతో కలిసి హబ్సిగూడలో ఉంటున్నారు. ఓ ప్రైవేటు కాలేజీలో టీచర్ గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆరు నెలల నుంచి ఉద్యోగం చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువగా ఉన్నాయి. కుమారుడికి విషమిచ్చి అనంతరం కూతురు ఉరేసి చంపారు. అనంతరం దంపతులు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకన్నారు. ఒయు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమ చావుకు ఎవరూ కారణం కాదు అని, వేరే మార్గం లేక తాము ఆత్మహత్య చేసుకున్నామని, క్షమించాలని, కెరీర్ లోనూ. శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని, మధుమెహం, నరాలు, కిడ్నీ సంబంధిత వ్యాధులతో ఇబ్బంది పడుతున్నానని సూసైడ్ నోట్ లో చంద్రశేఖర్ పేర్కొన్నారు. కల్వకుర్తి లో విషాదచాయలు అలుముకున్నాయి. ఒకే కుటుంబంలో నలుగురు చనిపోవడంతో బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## రెండు బైక్‌లను ఢీకొన్న కర్నాటక బస్సు

– ఐదుగురు వ్యక్తుల దుర్మరణం

కర్నూలు :

కర్నూలు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆదోని మండలం జాలిమంచి వద్ద కర్ణాటక ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రెండు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుప్పగళ్ గ్రామానికి చెందిన వీరన్న (25), ఆదిలక్ష్మి (20) ద్విచక్రవాహనంపై వస్తున్నారు. వీరి వెనుక కర్ణాటకకు చెందిన దేవరాజు, నాగరత్న, హేమాద్రి మరో బైక్‌పై వెళ్తున్నారు. ఈ రెండు ద్విచక్రవాహనాలను కర్ణాటక ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరన్న, ఆదిలక్ష్మి, దేవరాజు, నాగరత్న అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్ర గాయాలతో ఉన్న హేమాద్రిని ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ చనిపోయాడు. సంఘటన స్థలాన్ని ఆదోని డీఎస్పీ పరిశీలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే మంత్రి ఫరూక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



# చట్టసభలను చులకన చేయడం తగదు !

చట్టసభలకు ఎన్నికైన వారు..సభకు, ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా నడుచుకోవాలి. సభలో ప్రజల పక్షాన నిలబడాలి. హోదాతో సంబంధం లేకుండా నడుచు కునేలా చూసుకోవాలి. అయితే తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షహోదా కలిగిన బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చట్టసభలకు రావడం లేదు. సభలో ప్రజాసమస్యలపై చర్చించడం లేదు. ప్రతిపక్ష హోదా ఉన్నా కూడా యాన సభకు రాకుండా మొహం చాటేస్తున్నారు. పదేళ్లపాటు సిఎంగా పని చేసిన కెసిఆర్ విపక్షానికి పరిమితం కావడంతో ఇక ప్రజలతో పనేం అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రభుత్వం బాగా పనిచేయడం లేదని, ఇక అంతు తేలుస్తానని బయటనుంచి మాట్లాడుతున్నారు. కానీ సభకు వచ్చి సమసయలను ప్రస్తావించడం, తన ప్రభుత్వ హయాంలో జరిగిన మంచిచెడులను చర్చించడం జరగడం లేదు. ఇది ఓ రకంగా ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. అలాంటప్పుడు జీతభత్యాలు తీసుకోరాదు. నిజానికి ప్రజాప్రతినిధులకు జీతభత్యాలు, పెన్షన్లపై చర్చించాలి. వారికి కోట్లాది రూపాయలు చెల్లించాల్సిన అవసరమేముందో తేల్చాలి. ప్రజలు పన్నుల రూపంలో కట్టిన డబ్బుతో వారు సుఖాలు అనుభవిస్తున్నారు. ఇకపోతే ఎ.పి అసెంబ్లీలో జగన్ మోహన్ రెడ్డికి ప్రతిపక్ష నేత హోదా ఇచ్చే అంశం మీద ఆసక్తికర చర్చ జరుగుతున్న విషయం తెలిసిందే. ప్రతిపక్షహోదా ఇస్తే తప్ప సభకు రానని మూర్ఖంగా వాదించడం జగన్‌కే చెల్లింది. 11 సీట్లతో ప్రతిపక్ష హోదా రావాలంటే రాదు. దానికి సభా సంప్రదాయాలు, నియమాలు ఉన్నాయి. ఐదేళ్లు ముఖ్యమంత్రిగా, గతంలో ఎంపిగా పనిచేసిన జగన్ చట్టాల గురించి తెలుసుకోకుండా సభకు రానని చెప్పడం ఎన్నుకున్న ప్రజలను అవమానించడం తప్ప మరోటి కాదు. ప్రతిపక్షహోదా ఉన్న కెసిఆర్ రావడం లేదు..విపక్ష హోదా లేదు కనుక రాను పో అని జగన్ అంటున్నారు. ఇలాంటి నేతలను నమ్ముకుంటే ప్రజలు నట్టేట మునగడం ఖాయం. జగన్‌కి ప్రతిపక్ష హోదా ఇవ్వాలా వద్దా అనేది రాజకీయ నిర్ణయం కాదు. ఈ విషయంలో పార్లమెంటరీ సంప్రదాయాలు ఏం చెబుతున్నాయో పరిశీలించాలి. పార్లమెంటులో లేదా, అసెంబ్లీలో రాజకీయ పార్టీగా గుర్తింపు పొందాలంటే కొన్ని నిబంధనలు పాటించాలి. రాజకీయ పార్టీగా గుర్తింపు పొందితే, ఆ పార్టీ పార్లమెంటు లేదా అసెంబ్లీ ప్రాంగణంలో కొన్ని వసతులు పొందడానికి వీలుంటుంది. ఇటువంటి గుర్తింపు సభాపతి నుంచి వస్తుంది. ఎన్నికల సంఘం దగ్గర రాజకీయ పార్టీగా నమోదు చేసుకొని ఎన్నికల్లో పోటీ చేస్తాయి రాజకీయ పార్టీలు. అటువంటి పార్టీలకు చట్టసభలో ఒక సీట్ వున్నా అవి పార్లమెంటులో రాజకీయ పార్టీలుగానే కొనసాగుతాయిగానీ సభాధ్యక్షుడి గుర్తింపు వుండదు. సభాధ్యక్షుడి గుర్తింపు పొందితేనే సభా ప్రాంగణంలో కార్యాలయానికి గది కేటాయింపు వంటి వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది. స్పీకర్ ఆధ్వర్యంలో పనిచేసే బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశాలకు పిలుపు వస్తుంది. వసతుల కల్పనకు నిబంధనలు వేరుగా ఉంటాయి. దీనికి సంబంధించి పార్లమెంటులో మూడు నిబంధనలు పొందుపరిచారు. వాటినే అసెంబ్లీల్లో పాటిస్తున్నారు. కనీసం పదిశాతం సీట్లు పొందిన వారికే విపక్షపార్టీగా గుర్తింపు దక్కుతుంది. గత పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీకి విపక్షహోదా దక్కలేదు. అది కావాలని ఆ పార్టీ పట్టుబట్టలేదు. ఫలితంగా పది సంవత్సరాలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత అన్న వ్యవస్థ లేకుండా గడిచింది. 2014లోనూ, 2019లోనూ కాంగ్రెస్ పార్టీ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పటికీ దానికి పదో వంతు సంఖ్యా బలం లేదు. పదో వంతు సంఖ్యా బలం లేనప్పుడు ప్రతిపక్ష గ్రూప్‌గా గుర్తిస్తారుగాని ప్రతిపక్ష పార్టీగా గుర్తించక పోవటం గతంలో కూడా జరిగింది. 1984లో ఇందిరా గాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో లోక్‌సభలో అతి పెద్ద ప్రతిపక్షంగా ఏ జాతీయ పార్టీ నిలువలేదు. ప్రాతీయ పార్టీ అయిన తెలుగు దేశానికి ప్రతిపక్ష గ్రూప్ అన్న గుర్తింపు దక్కింది. అయితే చట్టంలో ప్రతిపక్ష నేతగా గుర్తింపు పొందాలంటే పదో వంతు సభ్యులుండాలన్న నిబంధన అన్నది సంప్రదాయంగా వస్తున్న నిబంధన మాత్రమే. 1977లో మొదటిసారి ప్రతిపక్ష నాయకుడు అనే వ్యవస్థ ఏర్పడిరది చట్టం ద్వారా. అయితే 1977లో అప్పటి జనతా ప్రభుత్వం ప్రవేశపెట్టిన చట్టం ప్రతిపక్ష నాయకుడిగా గుర్తింపునకు కనీస సభ్యుల సంఖ్యను సూచించలేదు. సభలో అధికారపార్టీని వ్యతిరేకించే పార్టీలలో ఎక్కువమంది సభ్యులుండే పార్టీనేతను ప్రతిపక్ష నేతగా సభాధ్యక్షులు గుర్తిస్తారని పేర్కొన్నది. సభలో అధికార పక్షాన్ని వ్యతిరేకించే ప్రతిపక్ష పార్టీలు సమాన సంఖ్యా బలం కలిగి వుంటే ఏ పార్టీ నేతను ప్రతిపక్ష నాయకుడుగా గుర్తించాలనేది ఆ యా పార్టీల స్థితిగతుల ఆధారంగా సభాధ్యక్షుడు నిర్ణయిస్తారు. ఆ విధంగా సభాధ్యక్షుడి గుర్తింపు పొందిన ప్రతిపక్ష నేతకు కొన్ని సదుపాయాలు కల్పిస్తారు. సభ లోపల వెలుపలా కూడా. జీత భత్యాలు, వాహనం, సహాయ సిబ్బంది, అధికారిక నివాసం మొదలైనవి వస్తాయి.. ప్రతిపక్ష నేతకు కాబినెట్ మంత్రి హోదా కల్పించటం ఒక సంప్రదాయంగా వస్తున్నది. అయితే ఇక్కడ ముఖ్యమైన అంశం ఏమిటంటే ఒక పార్టీకి చట్టసభలో గుర్తింపు పొందటానికి అవసరమైన సభ్యులే లేకపోతే, అలాంటి పార్టీ నాయకుడికి ప్రతిపక్ష హోదా ఇచ్చే ప్రసక్తే లేదనేది 2014లో నాటి లోక్‌సభ స్పీకర్ తేల్చేశారు. ఇది రాజకీయపరమైన నిర్ణయం. ఈ వాదన 2014లో తెర మీదకు వచ్చింది. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పదో వంతు సభ్యులు కూడా లేరు. కాంగ్రెస్ పార్టీ దానిమీద ఏమీ రాద్ధాంతం చెయ్యలేదు. సభా కార్యకలాపాలకు దూరంగానూ లేదు. ప్రతిపక్ష నాయకుడిని సంప్రదించవలసిన ప్రతి సందర్భంలోను అప్పుడు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభాపక్ష నేత అధీర్ రంజన్ చౌదరిని ప్రభుత్వం సంప్రదించింది. రాజ్యాంగ బద్ధమైన పదవులకు నియామకాలు చేసే కమిటీలో ప్రతిపక్ష నేత కూడా సభ్యుడు. ఉదాహరణకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి నియామకం. అటువంటి నియామకాలప్పుడు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వకున్నా నరేంద్ర మోడీ ప్రభుత్వం అధీర్ రంజన్ చౌదరిని సంప్రదించింది. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రతిపక్షనేత హోదా కావాలని జగన్ పట్టుబట్టడం అసమంజసం. తనకు దక్కదని తెలిసి కూడా ఆ హోదా కోసం ఆరాటపడటం హుందాతనం అనిపించు కోదు. సభలో మాట్లాడటానికి కేటాయించే సమయం రాజకీయ పక్ష సభ్యుల సంఖ్యాబలం మీద ఆధారపడి ఉంటుంది. మాట్లాడే హక్కు ప్రతి సభ్యుడికీ ఉంటుంది. ఎంతసేపు అనేది సభాపతి నిర్ణయం. ప్రతిపక్షనేత గనుక కచ్చితంగా ఇంత సమయం కేటాయించాలి అన్న నిబంధన ఏమీ లేదు. తనకు 40 శాతం ఓట్లు వేసిన ప్రజల పక్షాన పోరాడాల్సిన సమయంలో హోదా ఇవ్వలేదనే వంకతో అసెంబ్లీకి రాకపోవటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది కెసిఆర్, జగన్ ఇద్దరికీ వర్తిస్తుంది. సభకు ఎన్నికయ్యాక సమావేవాలకు హాజరు కావాల్సిందే. ప్రజల పక్షాన నిలబడాల్సిందే. అంతే తప్ప తమ మూర్ఖ వాదనలతో ప్రజలను చులకన చేయడం సరికాదు.

## లక్షలాది మందికి స్ఫూర్తి దాయకం..

# ఉప్పు సత్యాగ్రహం

**మార్చి 12... ఉప్పు సత్యాగ్రహ ప్రారంభ దినం**

**తొమ్మిది దశాబ్దాల క్రితం జాతిపిత మహాత్మా గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించి, వేలాది మందితో నిరసన తెలిపి, లక్షలాది మందిని చైతన్య పరిచిన సంఘట న. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ మహాత్మా గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ లోని దండి వద్ద ఉప్పు తయారు చేసి స్ఫూర్తిని కల్పించిన మరిచి పోలేని నేపథ్యం.**



ఉప్పు సత్యాగ్రహ ప్రచారం గాంధీ ప్రవచించిన సత్యాగ్రహ సూత్రాలపై ఆధార పడింది.1930 ప్రారంభంలో, బ్రిటిషు పాలన నుండి భారత సార్వ భౌమత్వాన్ని, స్వయం పాలననూ సాధించుకోవటానికి భారత జాతీ య కాంగ్రెస్, తన ప్రధాన వ్యూహం గా సత్యాగ్రహాన్ని ఎంచుకుంది. ప్రచారాన్ని నిర్వహించడానికి గాంధీని నియమించింది. 1882 బ్రిటిషు ఉప్పు చట్టాన్ని గాంధీ తమ సత్యాగ్రహ మొదటి లక్ష్యంగా ఎంచుకున్నారు. గాంధీ, తన ప్రార్థన సమావేశాల లోనూ పత్రికలతో ప్రత్యక్షంగా మాట్లాడుతూ, ప్రకటనలు ఇస్తూ ప్రపంచ వ్యాప్తంగా మీడియాను ఈ మార్చ్ కోసం సిద్ధం చేశాడు. మార్చ్‌కు ముందు రోజు సాయంత్ర పు ప్రార్థనలో గాంధీ చెప్పేది వినడానికి వేలాది మంది భారతీయులు సబర్మతికి చేరుకున్నారు. అమెరి కన్ పత్రిక, ది నేషన్ ఇలా రాసింది: "గాంధీ ఇచ్చే పోరాట ప్రకటన వినడానికి 60,000 మంది ప్రజలు నది ఒడ్డున గుమిగూడారు. ఈ పోరాటపు పిలుపు బహుశా ఇప్పటి వరకు ఇచ్చిన పిలుపులన్నిటి లోకీ విలక్షణమైనది".

భారతదేశంలో బ్రిటిషు పాలనకు వ్యతిరేకంగా జరిపిన శాసనోల్లం ఘనలో భాగంగా, మహాత్మా గాంధీ నేతృత్వంలో భారత జాతీయ కాంగ్రె సు జరిపిన అహింసాయుత సత్యా గ్రహమే ఉప్పు సత్యాగ్రహం. దీన్ని దండి సత్యాగ్రహం అనీ, దండి యాత్ర అనీ, దండి మార్చ్ అనీ కూడా పిలుస్తారు. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ గాంధీ,1930 మార్చి 12 నుండి 1930 ఏప్రిల్ 6 వరకు, 384 కిలోమీటర్ల దూరం, వేలమంది సత్యాగ్రహులతో కలిసి పాదయాత్ర చేసి గుజరాత్ తీరం లోని దండి వద్ద ఉప్పు తయారు చేసాడు. శాస నోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేలా స్ఫూర్తినిచ్చే బలమైన ప్రారంభ ఘటనగా దండి యాత్ర ఉపయోగ పడింది. మహాత్మా గాంధీ తన 79 మంది సత్యాగ్రహ వాలంటీర్లతో సబర్మతి ఆశ్రమంలో ఈ యాత్రను ప్రారంభించాడు. దండి సత్యాగ్రహం లో మహాత్ముని తో కలిపి 80మంది పాల్గొన్నారు.

1. మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ, గుజరాత్, 2. ప్యారేలాల్ నయ్యర్, పంజాబ్, 3. ఛగన్‌లాల్ నాథ్థు భాయ్ జోషి ,గుజరాత్, 4.పండిత నారాయణ్ మోరేశ్వర్ ఖరే మహా రాష్ట్ర, 5. గంపత్ రావ్ గోడ్సే మహారాష్ట్ర, 6.ప్రిథ్వీరాజ్ లక్ష్మీదాస్ అషర్ గుజరాత్, 7.మహవీర్ గిరి 8. బాల్ దత్తాత్రేయ కాలేల్కర్ మహా రాష్ట్ర, 9.జయంతి నాథుభాయ్ పరెఖ్ గుజరాత్,10 .రసిక్ దేశాయ్ గుజరాత్, 11. విఠల్ లీలాధర్ థక్కర్ గుజరాత్, 12. హరఖ్జీ రాంజీభాయ్ గుజరాత్, 13 .తన్సుఖ్ ప్రన్షంకర్ భట్టు గుజరాత్, 14. కాంతీలాల్ హరి లాల్ గంధి గుజరాత్, 15. ఛోటూ భాయ్ ఖుషల్భాయ్ పటేల్ గుజ రాత్, 16. వాల్జీభాయ్ గోవింద్‌జీ దేశాయ్ గుజరాత్,17. పన్నాలాల్ బలభాయ్ ఝవేరి గుజరాత్, 18 .అబ్బాస్ వర్తేజీ గుజరాత్, 19. పుంజాభాయ్ షా కూడా గుజరాత్, 20. మాధవ్‌జీ భాయ్ థక్కర్ గుజరాత్, 21. నరంజీ భాయ్ గుజరాత్, 22 .మగన్ భాయ్ వోర గుజరాత్, 23. దుంగార్సీ భాయ్ గుజరాత్, 24 .సోమాలాల్ ప్రాగ్జీ భాయ్ పటేల్ గుజరాత్, 25 .హస్ముఖ్‌రాం జకాబార్ గుజ రాత్, 26. దౌడ్‌భాయ్ గుజ రాత్, 27 .రాంజీ భాయ్ వంకర్ గుజరాత్, 28. దినకర్‌రాయ్ పాండ్య గుజ రాత్, 29 .ద్వారకానాథ్ మహారాష్ట్ర, 30. గజానన్ ఖరే మహారాష్ట్ర, 31. జెథాలాల్ రూపా రెల్ కచ్ గుజరాత్, 32. గోవింద్ హర్కరే మహారాష్ట్ర, 33. పాండు రంగ్ మహారాష్ట్ర, 34 .వినాయక్ రావ్ ఆప్తే మహారాష్ట్ర, 35. రాంతీర్థ్ రాయ్ యునైటెడ్ ప్రావిన్సెస్, 36 .భాను శంకర్ దవే గుజరాత్, 37. మున్షిలాల్, 38. రాఘవన్ కేరళ, 39. రవ్జీభాయ్ నాథలాల్ పటేల్ గుజరాత్, 40 .షివభాయ్ గోఖల్భాయ్ పటేల్ గుజరాత్, 41. శంకర్భాయ్ భీకాభాయ్ పటేల్ గుజరాత్, 42. జష్భాయ్ ఇష్వర్భా య్ పటేల్ గుజరాత్, 43. సుమం గళ్ ప్రకాశ్, 44 .థేవర్ తుండియిల్ టైటస్ కేరళ, 45. కృష్ణ నాయర్ కేరళ, 46 .తపన్ నైర్ కేరళ, 47. హరి దాస్ వర్జీవందాస్ గాంధీ గుజ రాత్, 48. చిమన్లాల్ నర్సిలాల్ షహ గుజరాత్, 49. శంకరన్ కేర ళ, 50. సుబ్రహ్మణ్యం ఆంధ్రప్రదేశ్,51. రామనిక్లాల్ మగన్లాల్ మొది గుజరాత్, 52. మదన్ మోహన్ చతుర్వేది రాజస్థాన్,53. హరిలాల్ మహింతుర మహారాష్ట్ర, 54. మోతీ బస్ దాస్ ఒడిశా, 55.హరిదాస్ మజుందార్ గుజరాత్, 56 .ఆనంద్ హింగోరిని సింధ్, 57. మహదేవ్ మార్తాండ్ కర్ణాటక, 58. జయంతిప్రసాద్ యునైటెడ్ ప్రావిన్సెస్, 59. హరిప్రసాద్ యునై టెడ్ ప్రావిన్సెస్, 60. అనుగ్రహ నారాయణ్ సిన్హా బీహార్,61.కేశవ్ చిత్రే మహారాష్ట్ర, 62 .అంబలాల్ శంకర్భాయ్ పటేల్ గుజరాత్, 63. విష్ణు పంత్ మహారాష్ట్ర, 64. ప్రేంరాజ్ పంజాబ్, 65. దుర్గేష్ చంద్ర దాస్ బెంగాల్,66. మాధవ్‌లాల్షా గుజరాత్, 67 .జ్యోతిరాం 68. సూరజ్ భాన్ పంజాబ్, 69. భైరవ్ దత్త్, 70 .లాల్జీ పర్మర్ గుజరాత్,71. రత్నజీ బోరీ గుజరాత్,72 .విష్ణు శర్మ మహారాష్ట్ర,73. చింతామణి శాస్త్రి మహారాష్ట్ర, 74 .నారాయణ్ దత్త్ ,రాజస్థాన్,75 .మనిలాల్ మోహందాస్ గాంధీ గుజరాత్, 76 .సురెంద్ర, 77 .హరి కృష్ణ మొహొని మహారాష్ట్ర, 78 .పురతన్ బుచ్ గుజరాత్, 79 .ఖరగ్ బహదూర్ సింఘ్ గిరి నేపాల్ సంస్థానం, 80 .శ్రీ జగత్ నారాయణ్ ఉత్తర ప్రదేశ్.

ప్రసిద్ధ దండి యాత్రలో పాల్గొన్న ఈ సత్యాగ్రహులను గౌరవిస్తూ ఐఐటి బొంబాయి ఆవరణలో ఒక స్మారక చిహ్నాన్ని రూపొందించారు.

1930 ఏప్రిల్ 6 న, ఉదయం 6:30 గంటలకు గాంధీ దండిలో ఉప్పు చట్టాలను ఉల్లంఘించినప్పుడు, ఇది కోట్లాది భారతీయులు బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున శాసనోల్లంఘన ఉద్యమం లో పాల్గొనడానికి స్ఫూర్తి నిచ్చింది.

ఏప్రిల్ 6 ఉదయం, ప్రార్థన తరువా త, గాంధీ ఉప్పు బురదను పైకి లేపి, "దీనితో, నేను బ్రిటిషు సామ్రా జ్యపు పునాదులను కదిలిస్తు న్నాను" అని ప్రకటించాడు. తరు వాత ఆయన దానిని సముద్రపు నీటిలో ఉడకబెట్టి, బ్రిటిషు చట్టాన్ని ధిక్కరిస్తూ ఉప్పును తయారు చేశాడు. తన వేలాది మంది అనుచరులను కూడా అదేవిధంగా సముద్ర తీరం వెంబడి "ఎక్కడ వీలుగా ఉంటే అక్కడ" ఉప్పును తయారు చేయమని చెప్పాడు. గ్రామస్థులను కూడా ఉప్పును తయారు చేయమని చెప్పమని కూడా వారిని కోరాడు. ఇలా 79మందితో మహాత్ముడు ఈ కార్యక్రమం ప్రాంభించగా, సాధా రణంగా గాంధీ కార్యక్రమాలలో జనసమూహాన్ని తగ్గించి రాసే అధికారిక వార్తాపత్రిక ది స్టేట్స్‌మన్, సబర్మతి – అహ్మదాబాద్ రహదారిపై 1,00,000 మంది ప్రజలు ఉన్నారని పేర్కొనడం గమనార్హం.

**- రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

## మెట్లు ఎక్కగానే ఇక అయ్యప్ప దర్శనం

**మార్పులకు శ్రీకారం చుట్టిన బోర్డు**

**ఈనెల 15 నుంచి అమల్లోకి నిర్ణయం**

తిరువనంతపురం : శబరిమల అయ్యప్ప ఆలయంలోని సన్నిధానంలో 18 పవిత్ర మెట్లను అధిరోహించిన వెంటనే భక్తులు నేరుగా స్వామి దర్శనం అయ్యేలా మార్పులు చేయాలని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) నిర్ణయించింది. ఈ మార్పును ఈ నెల 15 నుంచి 12 రోజుల పాటు విష్ణు పూజ జరిగే రోజుల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని టీడీబీ అధ్యక్షుడు పి.ఎస్.ప్రశాంత్ వెల్లడిరచారు. ఇది విజయవంతమైతే తదుపరి మండల మకరవిళక్కు సీజన్‌లోనూ దీన్ని కొనసాగిస్తామని తెలిపారు. మెట్లను ఎక్కిన వెంటనే ప్రస్తుతం భక్తులను ఒక వంతెన మీదికి మళ్లిస్తున్నామని అక్కడ వారు కొంత సమయం క్యూలో వేచి ఉండి అనంతరం స్వామి దర్శనం కోసం మరోవైపునకు వెళ్తున్నారని ప్రశాంత్ చెప్పారు. ఈ పద్ధతిలో భక్తులకు కేవలం ఐదు సెకన్ల వరకే దర్శనభాగ్యం దక్కుతోందన్నారు. భక్తులు మెట్లు ఎక్కిన వెంటనే దర్శనం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త మార్పు కారణంగా ప్రతి భక్తునికి 20 నుంచి 25 సెకన్ల పాటు దర్శనం చేసుకునే వీలు కలుగుతుందన్నారు. అలాగే మెట్లు ఎక్కగానే స్వామి దర్శనం జరిగిందన్న అనుభూతి కూడా ఉంటుందని భావిస్తున్నారు. మెట్లు ఎక్కగానే దర్శనం కలగాలని మాలధారులు కూఆ కోరుకుంటున్నారు.

## బిజెపిలో అప్పుడే కదనోత్సాహం

**కాంగ్రెస్ లక్ష్యంగా రాజకీయ పోరాటం**

**రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం**

హైదరాబాద్ :

ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తర్వాత తెలంగాణ రాజకీయ పరిణామాలు తమకే అనుకూలమన్న భ్రమలో కమలం నేతలు ఉన్నారు. ఇదే క్రమంలో రాష్ట్రానికి చేయాల్సిన కేంద్ర సాయంపైనా వాదప్రతివాదనలు సాగుతున్నాయి. అలాగే రానున్న రోజుల్లో మారబోతున్నాయా అనే చర్చ మొదలైంది. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానంలో కాంగ్రెస్ ఓడి, బీజేపీ గెలవడంతో ఇక తెలంగాణలో రానున్నది తమ ప్రభుత్వమేనంటూ కమలం నేతలు ధీమాలో ఉన్నారు. బిఆర్ఎస్, బిజెపిలు కుమ్మక్కయాయయని మరోవైపు కాంగ్రెస్ ఆరోపిస్తోంది. అయితే రానున్న స్థానిక ఎన్నికలతో పాటు, జిహెచ్ఎంసిలు పాగా వేయాలని బిజెపి ఉవ్వీళ్లూరుతోంది. ఈ ప్రభుత్వంపై ఏడాది కాలంలోనే ప్రజలు అసంతృప్తితో ఉన్నారని బీజేపీ ప్రచార చేస్తోంది. బిజెపికి కొత్త సారథిని ఎంపిక చేయాల్సి ఉంది. అప్పుడే పార్టీలో కొంత చలనం రాగలదని కూడా అంటున్నారు. ఈటెల, రఘునందన్ రావు, డికె అరుణల మధ్య పోటీ నడుస్తోంది. ఇందులో ఈటెల, అరుణలు ఆదినుంచి బిజెపి నేతలు కారన్నవ ఇషయం గుర్తించాలి. మరోవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతుతో బీజేపీ గెలుపొందిందని, రెండు పార్టీలు కలిసి తమపై కుట్ర చేసినా తమకు గణనీయమైన సంఖ్యలో ఓట్లు వచ్చాయని కాంగ్రెస్ నేతలు చెప్పుకుంటున్నారు. అయితే బిజెపి, బిఆర్ఎస్ కలసినా కాంగ్రెస్‌ను ఏమీ చేయవని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కాంగ్రెస్‌లో మీనాక్షి నటరాజన్ వచ్చాక మార్పు వస్తుందా అన్నది కూడా చర్చ సాగుతోంది. వీరిందరినీ ఒక్కతాటిపైకి తెస్తారా అన్నది చూడాలి. మూడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. పోటీచేసిన ఒక స్థానంలో కాంగ్రెస్ పరాజయం చవి చూసింది. ఓవైపు బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. తెలంగాణ ప్రజలు కాంగ్రెసను నమ్మడం లేదని, రానున్న రోజుల్లో తామే ప్రత్యామ్నాయం అంటూ కమలం నేతలు చెప్పుకొస్తున్నారు. ఈక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం ద్వారా బీజేపీ బలపడిరదా.. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడనుందా.. తెలంగాణలో రాజకీయ పరిణామాలు మారబోతున్నాయా.. మార్పులు వస్తే భవిష్యత్తులో ఏ రాజకీయపార్టీకి కలిసొస్తుందనే చర్చ జరుగుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపుతో బీజేపీ శ్రేణులు మంచి ఉత్సాహంతో ఉన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇదే ఊపుతో పనిచేసేందుకు హైకమాండ్ కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

దీంతో2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ 8 శాసనసభస్థానాలను గెలుచుకుంది. ఆ తర్వాత జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అనూహ్యంగా పుంజుకుని, 8 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. తాజాగా రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడం బీజేపీకి ప్లస్ పాయింట్‌గానే చెప్పుకోవచ్చు. ప్రస్తుతం తెలంగాణలో గతంతో పోలిస్తే బీఆర్ఎస్ బలం కొంతమేరకు తగ్గిందనే చర్చ సాగుతోంది. బీజేపీ బలపడుతున్నప్పటికీ రానున్న రోజుల్లో కాంగ్రెస్‌ను ఓడిరచే స్థాయిలో ఆ పార్టీ బలం పెంచుకోగలదా.. లేకుంటే బీఆర్ఎస్ తన బలాన్ని పెంచుకుని కాంగ్రెస్‌కు సవాల్ విసురుతుందా అనేది వేచి చూడాలి.

# మరో బాదుడుకు సిద్ధమవుతున్న కేంద్రం

**యూపిఐ చెల్లింపులపై ఛార్జీలు విధించే యోచన**

న్యూఢిల్లీ, నినాదం:

యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులు ఇప్పుడు అందరూ అలవాటు పడ్డారు. ప్రజలు నగదు లావాదేవీలను పక్కన పెట్టారు. మోడీ పిలుపుతో అంతా ఆన్‌లైన్‌లకు అలవాటు పడ్డారు. ప్రస్తుతం ఇలాంటి యూపీఐ, రూపే డెబిట్ కార్డులతో చేసే లావాదేవీలపై వ్యాపారులపై ఎలాంటి ఛార్జీల భారం లేదు. అయితే, త్వరలోనే ఈ లావాదేవీలపైనా మర్చెంట్ ఛార్జీలను విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు జాతీయ మీడియా కథనాలు వెల్లడిరచాయి. ఇప్పటికే జిఎస్టీ తదితర భారాలు తప్పడం లేదు. బ్యాంకు లావాదేవీలపైనా భారం పడుతోంది. ఇవి చాలవన్నట్లుగా ఇప్పుడు యూపిఐ పేమెంట్లపై మోడీ దృష్టి పడిరదని అర్థం చేసుకోవచ్చు. రానున్న రోజుల్లో పెద్ద వ్యాపారులు యూపీఐ ఆధారిత చెల్లింపులకు ఛార్జీలు చెల్లించే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని కథనాలు పేర్కొన్నాయి. వార్షిక ఆదాయం రూ.40లక్షలపైన ఉండే వ్యాపారులకు యూపీఐ చెల్లింపులపై మర్చెంట్ డిస్కౌంట్ రేట్‌ను తిరిగి తీసుకురావాలని ప్రతిపాదిస్తూ బ్యాంకింగ్ ఇండస్టీ ప్రతినిధులు ఇటీవల కేంద్రానికి అధికారిక ప్రతిపాదన పంపారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించిందని ఓ బ్యాంకర్ వెల్లడిరచినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. ‘వీసా, మాస్టర్‌కార్డ్ వంటి డెబిట్ కార్డులు, ఇతర క్రెడిట్ కార్డులతో చేసే చెల్లింపులకు పెద్ద వ్యాపారులు ఎండీఆర్ ఛార్జీలు చెల్లిస్తున్నారు. అలాంటప్పుడు వారు యూపీఐ, రూపే డెబిట్‌కార్డు ఆధారిత లావాదేవీలకు ఎందుకు ఛార్జీలు కట్టకూడదు?‘ అని సదరు బ్యాంకర్ ప్రశ్నించారు. కేంద్రం కూడా ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుందని తెలిపారు. అయితే, ’టైర్డ్ ప్రైజింగ్ సిస్టమ్’ ఆధారంగా ఈ లావాదేవీలపై ఛార్జీలు విధించాలని కేంద్రం యోచిస్తున్నట్లు సమాచారం. అంటే.. రూ.40లక్షల్లోపు వార్షికాదాయం ఉండే వ్యాపారులు యూపీఐ చెల్లింపులను ఉచితంగానే స్వీకరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది.అయితే, ఈ ఛార్జీలను తిరిగి తీసుకురావడం వల్ల యూజర్లపై నేరుగా ఎలాంటి ప్రభావం ఉండబోదని తెలుస్తోంది. ఎందుకంటే ఈ లావేదేవీల కోసం యూజర్ల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరు. కాకపోతే దీనివల్ల వ్యాపారులు మళ్లీ నగదు చలామణికి మొగ్గు చూపే అవకాశాలున్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. ఆయా లావాదేవీలను ప్రాసెస్ చేసేందుకు ఈ రుసుము చెల్లించేవారు. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది. అయితే, ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ సబ్సిడీని రూ.3500 కోట్ల నుంచి రూ. 437 కోట్లకు తగ్గించారు.

# మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ త్వరలో ఏర్పాటు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష
- మహిళలకు వ్యాపార అభివృద్ధి,స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలు
- స్వశక్తి మహిళ సంఘాలకు నిర్వహించిన వ్యాపార అభివృద్ధి శిబిరం కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, మార్చి 11(నినాదం):** మహిళలకు వ్యాపార అభివృద్ధి,స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ అందించేందుకు జిల్లాలో మహిళా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను వీ-హబ్ సహకారంతో త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్వశక్తి మహిళ సంఘాలకు నిర్వహించిన వ్యాపార అభివృద్ధి శిబిరం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మాట్లాడుతూ జిల్లాలో మహిళల వ్యాపార అభివృద్ధి, నైపుణ్య అభివృద్ధి,ఆర్థిక సాధికారతను ప్రోత్సహించేందుకు వీ-హబ్ సహకారంతో త్వరలో మహిళ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ప్రారంభిస్తామని తెలిపారు. స్వశక్తి మహిళ సంఘాలకు వ్యాపారాల అభివృద్ధి, ఎంఎస్ఎంఈ పై అవగాహన పెంచుకోవాలని, నైపుణ్య అభివృద్ధి అవకాశాలు,వీటి ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాన్ని తెలియజేశారు.వ్యాపార అభివృద్ధి శిక్షణలు భాగంగా ఉత్పత్తి తయారీ మార్కెటింగ్ బ్రాండింగ్ వ్యాపార నిర్వహణ అంశాల లో మహిళలకు శిక్షణకు ఇచ్చి వ్యాపారాన్ని పెంచుకునే మార్గాన్ని అందించనున్నట్లు తెలిపారు.నైపుణ అభివృద్ధిలో భాగంగా ఆహార ఉత్పత్తి కలలు హస్తకళలు టెక్స్టైల్స్ వంటి రంగాల్లో సేమ్ ఉపాధి సాధనకు కావాల్సిన శిక్షణ అందిస్తామని అన్నారు. మహి ళలు తాము అనుకున్న రంగంలో ఓపికతో ఉంటే విజయాలు సాధించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఒక వ్యాపారం ప్రారంభించిన వెంటనే అధిక లాభాలు రావడం సాధ్యం కాదని, ఒక 6 నెలలు,సంవత్సరం పాటు కష్టతరంగా ఉన్న తట్టుకునే నిలబడినప్పుడే మన వ్యాపారం అభివృద్ధి పొందుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. వీ-హబ్ సంచాలకులు జహీద్ అక్తర్ షేక్,వీ-హబ్ అసోసియేట్ డైరెక్టర్ ఊహ,జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందిని,స్టూడెంట్ ప్రోగ్రామ్ లీడ్ జై, ప్రాజెక్టు కోఆర్డినేటర్ సాయిరాం,లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, జిల్లా పరిశ్రమల అధికారి కీర్తి కాంత్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మురళి,గోదావరిఖని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉష, విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఐపీఎస్



**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని టౌన్ డివిజన్ ఏసీపీ కార్యాలయాన్ని మంగళవారంనాడు కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఐపీఎస్ సందర్శించారు. కార్యాలయంలో గల పెండింగ్ కేసులపై సమీక్ష చేసారు. వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలనీ సూచించారు. అర్బన్ పోలీసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పెండింగ్ వారెంట్ల అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ హెూల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టా లన్నారు.గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా పిడిఎస్. బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం, వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు వన్ టౌన్ బిల్లా కోటేశ్వర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, ఉమెన్ పోలీసు స్టేషన్ ఇన్స్పెక్టర్ శ్రీలత తో పాటు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాలాల్ మహారాజ్ జయంతి నిధులు పక్కదారి

- అధికారికంగా జయంతి నిర్వహించకుండా సేవాలాల్ కు అవమానం
- అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలి
- బీఎస్పీ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్



**డోర్నకల్ /మరిపెడ మార్చ్ 11(నినాదం న్యూస్) :** బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించకుండా నిధులను కాజేశారంటూ బీఎస్పీ డోర్నకల్ నియోజకవర్గం ఇంచార్జ్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ అన్నారు..రాష్ట్రవ్యాప్తంగా సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించుటకు 2 కోట్ల నిధులు మంజూరు కాగా జనాభా తమాషా ప్రకారం డోర్నకల్ నియోజకవర్గానికి సుమారుగా 10 లక్షల రూపాయలు కేటాయించడం జరిగినది.ఈ పది లక్షల రూపాయల లో ఏడు మండలాలకు జనాభా ధామాషా ప్రకారం వెళ్లాల్సిన నిధులు సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమం చేయడానికి ఉపయోగించాలి కానీ పక్క నియోజక వర్గాల నుండి తెచ్చుకున్న స్థానికేతర నాయకులు,ఎమ్మెల్యే డోర్నకల్ నియోజకవర్గం లో ఉత్సవ కమిటీ చైర్మన్ గా తన యొక్క బాధ్యతను నిర్వర్తించకుండా నియోజకవర్గంలో పలు మండలాలలో సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించకుండా జాతి గురువును అవమానించినందుకు బేషరతుగా రాజీనామా చేయాలని బహుజన సమాజ్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ ఇన్చార్జ్ డిమాండ్ చేశారు.గత సంవత్సరం కూడా నిధులను యదేచ్ఛగా ఖర్చు చేసి సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని తూతూ మంత్రంగా చేసి ఆ నిధులను వారి యొక్క అనుచరులు కాజేశారని నియోజకవర్గంలో పలువురు మాట్లాడుకుంటున్న విషయం ఇది వరకు అందరికీ తెలిసినదే.సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించకుండా ఉండటంలో ప్రభుత్వ అధికారుల పాత్ర కూడా ఎంతో ఉంది కావున పై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర గిరిజన శాఖ సెక్రెటరీ శరత్ నాయక్ కల్పించుకొని మహబూబాబాద్ లో సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి నిధులను కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఇకపై ఉత్సవ కమిటీలను సిఫారసులకు లోబడి ఏర్పాటు చేయాలని డోర్నకల్ నియోజకవర్గంలో మండల స్థాయిలలో ఉత్సవ కమిటీలను ఏర్పాటు చేయాలని అందులో భాగంగా ప్రజాప్రతినిధులు అధికారులు మరియు కుల సంఘాల నాయకులను ఈ యొక్క కమిటీలలో చోటు కల్పించాలని పార్వతీ రమేష్ నాయక్ డిమాండ్ చేశారు..

## ప్రభుత్వ అసైన్డ్ భూముల రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని అరికట్టాలి



**నర్సంపేట, మార్చి 11(నినాదం) :** ప్రభుత్వం అసైండ్ భూముల ఆక్రమణ ఆపాలని,నిబంధనలను అతిక్రమించి భూ దందాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంసీపీఐ(యు )నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్ మాట్లాడుతూ విలువైన ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి కాపాడాలన్నారు.అనర్హుల స్వాధీనంలోని ప్రభుత్వ అసైన్డ్ భూములను ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాల్లన్నారు.నర్సంపేట పట్టణం జనాభాపరంగా పెరిగి మునిసిపాలిటీ గా అవతరించిందని, కానీ పేదలకు నివసించడానికి నిలువ నీడ లేక వేలాది కుటుంబాలు కిరాయి చెల్లిస్తూ జీవిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు చెందాల్సిన ప్రభుత్వ అసైన్డ్ భూములు రోజురోజుకీ అన్యాక్రాంతం అవుతున్నాయని,అధికారాన్ని అండగా చేసుకొని చట్టాలను నిబంధనలను అతిక్రమించి, ఏం చేసినా చెల్లుతుందిలే అన్నట్లుగా వ్యవహరిస్తూ,ఎలాంటి హక్కులు లేకపోయినా ప్రభుత్వ అసైన్డ్ భూములలో హద్దు రాళ్లు పాతుతూ మధ్యతరగతి ప్రజలను మభ్యపెడుతూ అమ్మకాలకు కొనుగోళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు.సర్వే నెంబర్ 111, 702, 813, 204 తదితర ప్రభుత్వ అసైన్డ్ భూములు యదేచ్ఛగా క్రయవిక్రయాలకు పాల్పడుతున్న అధికార యంత్రాంగంకు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అసైన్ భూముల రక్షణకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో పేదలను సమీకరించి అట్టి భూముల రక్షణకు పేదలకు నిలువ నీడ కల్పించడానికి పూనుకుంటామని రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మాషూక్, స్థానిక నాయకులు గజవెల్లి జగపతి నకినబోయిన మహేష్ అశోక్ మాలమ్మ జమున కృష్ణ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీనెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలి

- పీఎం శ్రీ పథకాన్ని రద్దు చేయాలి
- సిఐటియు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు డిమాండ్



**వనపర్తి ప్రతినిధి, మార్చి 11 (నినాదం న్యూస్) :** అంగన్వాడీలకు ప్రతి నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని, ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి నారాయణమ్మ డిమాండ్ చేశారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మార్చి 17, 18 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల సమ్మె (వంటావార్పు) నిర్వహిస్తున్నామని కోరుతూ డీ డబ్ల్యూ కు మంగళవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని అమలు చేసే ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని, అంగన్వాడి టీచర్లకు, హెల్పర్స్ కు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీ ప్రకారం రూ.18 వేలు వేతనం పెంచాలని, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ టీచర్లకు రెండు లక్షలు, హెల్పరకు లక్ష రూపాయలు పెన్షన్, విఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవోలు వెంటనే జారీ చేయాలని కోరారు. ఎండాకాలంలో ప్రభుత్వ పాఠశాలలకు సమానంగా మే నెల అంతా అంగన్వాడీలకు సెలవులు ఇవ్వాలని, ఆన్లైన్ యాప్ లన్నింటినీ రద్దుచేసి ఒకే యాప్ ఉండే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, బిఎల్ఓ డ్యూటీలు రద్దు చేయాలని, ఐసిడిఎస్ కు సంబంధం లేని పనులు చేయించకూడదని డిమాండ్ చేశారు. గతంలో చేసిన 24 రోజుల సమ్మె వేతనం వెంటనే చెల్లించాలని, అంగన్వాడీలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అన్నిటిని అమలు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం మార్చి 17, 18 తేదీల్లో జరిగే 48 గంటల సమ్మెను జయప్రదం చేయాలని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు జ్యోతి, నాగేంద్రమ్మ, రాజేశ్వరి, సంగీత, భారతి, రేణుక, శారద తదితరులు పాల్గొన్నారు

## ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాలు

- ప్రభుత్వ భూములలో అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలి
- ఆదివాసీ ప్రజా సంఘాల జేఏసి డిమాండ్



**మంగపేట, మార్చి11 (నినాదం న్యూస్) :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనుల చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములలో అక్రమంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు చేపడుతున్నారని, అక్రమంగా నిర్మిస్తున్న భవనాల నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మంగపేట మండల ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలు, గిరిజన చట్టాలకు విరుద్ధంగా నిర్మిస్తున్న బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలను నిలుపుదల చేయాలంటూ మంగపేట ఎంపీడీఓ భద్రు నాయక్ కు ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మంగపేట మండల ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ భూభాగంలో మంగపేట మండలం ఏజెన్సీ ప్రాంతం అన్నారు. మంగపేట తహసీల్దార్, మంగపేట ఎంపీడీవో, పంచాయతీ గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిధిలోని ప్రభుత్వ భూములను కబ్జా చేసి ఇల్లు నిర్మిస్తూ, బోర్లు వేస్తున్న గిరిజనేతరులపై క్రిమినల్ కేసులు పెట్టి, చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనుల చట్టాలకు విరుద్ధంగా వన్ ఆఫ్ 1959, వన్ ఆఫ్ 1970, పెసా చట్టం, గిరిజనుల చట్టాలకు విరుద్ధంగా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా ఇల్లు నిర్మాణాలు చేపట్టిన గిరిజనేతరులకు, ప్రభుత్వ భూములను అక్రమ పట్టాలు పొందిన గిరిజనేతరులకు నోటీసులు ఇచ్చి అట్టి ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని, అట్టి భూములను నిరుపేదలైన ఆదివాసులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వ భూములు కూడా గిరిజనుల భూములేనని, గిరిజనులకు దక్కవలసిన ప్రభుత్వ భూములను కొంతమంది గిరిజనేతరులు దౌర్జన్యంగా పైసలతో, బెదిరింపులతో, రాజకీయ అండతో గిరిజనుల ప్రాంతంలోని భూములు, గిరిజన భూములు, ప్రభుత్వ భూములు కబ్జాలు చేస్తూ అక్రమంగా దోసుకుంటున్నారని ఆరోపించారు. ఎల్.టి.ఆర్, 1/59, 1/70, గిరిజన చట్టాలకు విరుద్ధంగా గత తహసీల్దార్ తప్పుడు, అక్రమ పట్టా కాగితాలు ఇచ్చారని ఆరోపించారు. 1988లో పి.రామిరెడ్డి వర్సెస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం గిరిజనేతరులకు ఎలాంటి కాగితం కలిగి ఉన్నా అవి చల్లనేరావని, కోనేరు రంగారావు భూముల కమిషన్ ప్రకారం, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నేమ్ ఆర్ సి నె%శీ%116/2021/ ఎల్.టి.ఆర్ తేదీ 22.01.2021 ప్రభుత్వ ఉత్తర్వులలోని ఆదేశాలు ఉన్నప్పటికీ, ఆర్టికల్ 19 (5) ఆస్తి విషయంలో గిరిజనుల ప్రయోజనాల రక్షణ భారతదేశంలో ఎక్కడైనా నివసించడానికి, స్వేచ్ఛగా తిరగడానికి, ఆస్తి సంపాదించడానికి, అమ్ముకోవడానికి ప్రతివారికి హక్కు ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతంలో ఆ హక్కు గిరిజనేతరులకు లేదని ఈ క్లాస్ చెప్తుందని ( గిరిజనుల ప్రత్యేకత కారణంగా ) నాన్ ట్రైబల్ కు పట్టాలు పొందే హక్కు లేనప్పుడు భూములకు పట్టాలు పొందినవి బోగస్ పట్టాలు అని అర్థమవుతుందన్నారు. మంగపేట షెడ్యూల్ ప్రాంతంలో ప్రభుత్వ భూములలో రోజు రోజుకు పుట్టగొడుగుల్లా పుట్టకొస్తున్న అక్రమ కట్టడాలు గిరిజనేతరులవే కానే ఏ ఒక్క గిరిజనుడు కూడా ప్రభుత్వ భూమిని గుంట భూమి కూడా ఆక్రమించుకోలేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో అక్రమ వలసలు పెరగడం వలన ఆదివాసుల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఆదివాసుల అస్తిత్వానికే ప్రమాదంఅని అన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాలు చేసిన గిరిజనేతరులపైన క్రిమినల్ కేసులు పెట్టాలని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ భూములు కూడా ఆదివాసి గిరిజనుల భూములే కాబట్టి ఇట్టి భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని అన్నారు. మంగపేట మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలైన ఆదివాసులకు ఇవ్వాలని, షెడ్యూల్ ఏరియాలో గిరిజన చట్టాలు, 1/59 ,1/70, పెసా చట్టాలు, గిరిజనుల చట్టాలు పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల ఆదివాసి ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగపేట తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ మంగపేట మండల ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు, ఆదివాసి ప్రజా సంఘాల జే.ఏ.సి నాయకులు తోలెం నరసింహారావు, అన్నెబోయిన సమ్మయ్య, తోలెం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమానత్వం మన ఇంటి నుండి ప్రారంభం కావాలి

- నందారం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**జిన్నారం/పటాన్ చెరు మార్చి 11 (నినాదం న్యూస్) :** మహిళలు సమానత్వం అనేది మన ఇంటి నుండి ప్రారంభం కావాలని ఇంట్లో మగ పిల్లలను ఆడపిల్లలు సమానంగా చూడాలని అమీన్ పూర్ ఎస్సై సోమేశ్వరి అన్నారు. శనివారం నాడు అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో ఏర్పాటుచేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి యాదమ్మ, అమీన్ పూర్ స్సై సోమేశ్వరి,అడ్వకేట్ నీరజ, డాక్టర్ దీప్తి, తో పాటు నందారం లలిత, నందరం ఉమారాణి, నందారం సబిత తోపాటు పలువురు ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్య ఉపాధి రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం పెరగాలని వారు కోరారు. ప్రధానంగా అమ్మాయిలు బాగా చదువుకోవడం వల్ల ఆ కుటుంబానికి వెలుగును ఇస్తుందని వారు అన్నారు. మగ పిల్లలను ఆడ పిల్లలు సమానంగా పెంచాలని బాల్యం నుంచే ఇంట్లో సమానత్వం పెంపొందించాలని మగ పిల్లలకు మహిళలను గౌరవించే విధంగా విలువలు నేర్పాల్సిన అవసరం ఎంతో ఉందని వారు అన్నారు. కావున మహిళలందరూ బాగా ఎంతో కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవడం ఎంతో సంతోషకరంగా అని ప్రధానంగా ఈరోజు మహిళలు వారి కాళ్ళ మీద వాళ్లు నిలబడి ఒకవైపు కుటుంబ పోషణ పోషిస్తూ మరోవైపు సమాజంలో తమ బాధ్యతను నడిపిస్తూ ముందుకు వెళ్తున్నారని కావున మరొకసారి అందరికీ అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ నియామకాలను ఆపాలి

- ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్



**మహాదేవపూర్, మార్చి 11 (నినాదం న్యూస్) :** ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు ఎలాంటి ప్రభుత్వ నియామకాలను చేయకూడదని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేష్ మాదిగ డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాదిగల పట్ల చూపుతున్న వివక్షను మార్చుకోవాలని నిండు అసెంబ్లీలో ఏదైతే రేవంత్ రెడ్డి మాట ఇచ్చాడో అదే మాట ప్రకారం వర్గీకరణ వీళ్లను ఆమోదింపజేసి, ఆ తర్వాతనే ప్రభుత్వ నియామకాలను చేపట్టాలని ఆయనఅన్నారు. మాదిగ లకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని రాబోవు రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఉనికిని చాటుకోవడానికి కూడా వీలులేనంతగా మాదిగలు ఉద్యమాలు చేపడతారని హెచ్చరిం చారు. ఈ నిరాహార దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజయ్య,మల్లయ్య, సదానందం, సుశాంత్, జాషువా, సాగర్ పాల్గొన్నారు.

## నిరంతరం ప్రజా సమస్యల కోసం పనిచేస్తా

- అమీన్ పూర్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్

**జిన్నారం/పటాన్ చెరు మార్చి 11 (నినాదం న్యూస్) :** అమీన్ పూర్ న్సిపాలిటీ వైస్ చైర్మన్ గా ఐదు సంవత్సరాలు అవకాశం కల్పించిన ప్రజలకు నిరంతరం రుణపడి ఉంటానని అమీన్ పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహా గౌడ్ తెలిపారు. మంగళవారం నాడు అమీన్ పూర్ మున్సిపాలిటీ 12వ వార్డులోని జయలక్ష్మి నగర్ ఫేస్ 2 కాలనీవాసులు ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కాలనీవాసులు నరసింహా గౌడ్ కు భారీ గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. కాలనీ ప్రజల మౌలిక వసతుల కోసం వారి సమస్యలే లక్ష్యంగా నిరంతరం పనిచేశానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జయలక్ష్మి నగర్ ఫేస్కా 2 లనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు పలువురు నాయకులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## శ్రీధర్‌బాబు ఇచ్చిన మాటకు కట్టుబడవా

- రెండు రోజులకే ఇసుక బంద్ చేస్తా అంటివి
- ఇంకెంత మంది ప్రాణాలు బలికావాలి
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవిందర్



**మంథని మార్చి 11 (నినాదం న్యూస్):** ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఇసుకను బంద్ చేస్తా అంటివి ఇచ్చిన మాటకు కట్టుబడవా అని మంత్రి శ్రీధర్‌బాబును బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శెంకేషి రవిందర్ సూటిగా ప్రశ్నించారు. మంగళవారం సెంటినరీకాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రజలను రెచ్చగొట్టి మీ తాతముత్తాతల ఆస్తి ఇసుకను బీఆర్ఎస్ నాయకులు కొల్లగొడుతున్నరు అంటివి మరి ఇప్పుడు ఈ ఇసుక ఎవరి ఆస్తి, ఇప్పుడు ఎవరు కొల్లగొడుతున్నరని ఆయన విమర్శించారు. ఎన్నికలకు ముందు అమలు సాధ్యం కాని ఆరు గ్యారంటీల మాదిరిగానే మంథని ప్రజలను మభ్యపెట్టేందుకు తాము గెలిచిన రెండు రోజుల్లోనే లారీలను ఆపేయిస్తా అని పదిహేను నెలలు గడిచినా ఇంకా ఎందుకు ఆపడం లేదని ఆయన ప్రశ్నించారు. మహదేవ్‌పూర్ నుండి కమాన్‌పూర్ వరకు ఇసుక లారీలు మరణమృదంగం మోగిస్తుంటే నిత్యం వరుస ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బొమ్మాపూర్‌లో, అడవిసోమన్‌పల్లిలో, కాటారం మండల కేంద్రంలో, రామయ్యపల్లెవద్ద వరుస ప్రమాదాలు చోటుచేసుకోగా సోమవారం కమాన్‌పూర్ వద్ద జరిగిన ప్రమాదంలో పోలీసుల కళ్ల ముందే కల్వచర్లకు చెందిన దొంతుల వాణి అక్కడికక్కడే మృత్యువాత పడిందన్నారు. ఇంకెంత మంది ప్రాణాలు బలైతే ఇసుకను బంద్ చేస్తారని, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అక్కడ మానేరులో ఒక్కటంటే ఒక్క క్వారీ కూడా నడవకుండా చర్యలు చేపడితే ఆ పని మీకెందుకు సాధ్యపడటం లేదని ఆయన నిలదీశారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం ఇసుక క్వారీలను బంద్ చేసి ఇసుక రవాణా ఆపకపోతే రాబోయే రోజుల్లో ప్రజలే మీకు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, రైతుబంధు అధ్యక్షుడు మేదరవేని కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కాపురవేన భాస్కర్, మాజీ ఎంపీటీసీ ధర్మల రాజసంపత్, నాయకులు కన్నూరి శ్రీశైలం, దామెర శ్రీనివాస్, మాచీడి సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## పసుపు ధరపై జిల్లాలో..
# రైతులు ఆందోళన చెందవద్దు

- నుడా చైర్మన్ కేశ వేణు



**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 11 (నినాదం న్యూస్) :** గత మూడు నాలుగు రోజులుగా పసుపు ధరపై జిల్లాలో రైతులు ఆందోళన చెందుతున్నారని, పసుపు కొనుగోళ్లకు ప్రత్యేక అధికారిని నియమించాలని కలెక్టర్ ను కోరామని, ప్రత్యేకాధికారిని నియమించి రైతులకు న్యాయం చేస్తామని ఆందోళన చెందొద్దని నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. జిల్లా కాంగ్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నుడా చైర్మన్ కేశ వేణు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి తో కలిసి మాట్లాడారు. పసుపు ధర పెరిగిన సమయంలో అది కేంద్ర ప్రభుత్వ గొప్పతనమని, ఎగుమతులు చేపట్టడం ద్వారా ధర పెరిగిందని గొప్పలు చెప్పుకున్న ఎంపీ అర్వింద్, ప్రస్తుతం ధర తగ్గినా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. పసుపు బోర్డు తీసుకువచ్చానని గొప్పలు చెప్పుకునే ఎంపి అర్వింద్, నిజామాబాద్ లో పసుపు పండిస్తే బోర్డును ఢిల్లీలో పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే పసుపు బోర్డును నిజామాబాద్ లో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పసుపు ధర ఎందుకు తగ్గిందో చెప్పాల్సిన బాధ్యత జాతీయ పసుపు బోర్డు చైర్మన్, ఎంపీపై ఉందన్నారు. పసుపు రైతుల సమస్యల పరిష్కారం కోసం తామెల్లప్పుడూ కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నిరుద్యోగులు, ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ అండగా నిలిచినా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోవడం నిరాశకు గురి చేసిందని మోహన్ రెడ్డి అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత 56వేల ఉద్యోగాలు ఇచ్చినా పట్టభద్రులు తమకు ఓటెందుకు వేయలేదో అర్థం కావడం లేదని, ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై జిల్లా కాంగ్రెస్ నాయకులందరం కలిసి సమీక్షిస్తామన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు గోపి, ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేణు రాజ్,బింగి శుభం, సాయి కిరణ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డితోనే..
# రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

- కడ్తాల్ మండల పర్యటనలో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**మహేశ్వరం, మార్చి 11 (నినాదం న్యూస్):** అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి విద్య వైద్య ఆరోగ్య తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ శ్రీనివాస కల్యాణమహోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ అండ్ టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి స్వామివారి పూజలో మొక్కులు చెల్లించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించిన,స్వామివారి ఆశీర్వాదాలతో ప్రజలందరు ఎల్లప్పుడూ పాడిపంటలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. అనంతరం ముద్విన్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్కపోతు మధు నూతన గృహానికి సందర్శించి ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. వారు మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సత్కరిస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రావిచేడ్ దేవాలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు, గ్రామ కార్యకర్తలు, పెద్దలు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు స్నేహితులు బంధువులు మిత్రులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం కష్టపడ్డ వారికి కచ్చితంగా..
# ప్రతిఫలం ఉంటుంది

- కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లకవత్ సవేందర్



**మల్హర్, మార్చి 11 (నినాదం న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డవారికి కచ్చితంగా ఫలితం ఉంటుందని ఇందుకు నిదర్శనమే బంజారా ముద్దుబిడ్డ కేతావత్ శంకర్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడమేనని కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి జిల్లా ఎస్టీసెల్ ప్రధాన కార్యదర్శి లకవత్ సవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యావత్ తెలంగాణ గిరిజన సమాజాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబులకు గిరిజన సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని ఆనందాన్ని వ్యక్తం చేసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి..



**చేవెళ్ల, మార్చి 11 (నినాదం న్యూస్):** తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా ద్వితీయ మహాసభలు రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గం శంకరపల్లి మండలం ప్రొద్దుటూరు రెవెన్యూ పరిధిలోని ప్రగతి రిసార్ట్ లో అట్టహాసంగా సాగాయి. ఈ నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులకు ప్రమాద భీమాకు యువ నేత,రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి 3 లక్షల చెక్కును అందజేశారు. స్వర్గీయ ఇంద్రారెడ్డి ట్రస్ట్ తరుపున మంగళవారం జరిగిన జిల్లా మహాసభలో ఈ చెక్‌ను యూనియన్ మాజీ జాతీయ అధ్యక్షులు దేవుల పల్లి అమర్,జాతీయ కార్యదర్శి నరేందర్ రెడ్డి, కోశాధికారి వెంకట్ రెడ్డి,రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు విరహత్ అలీ,రామనారాయణ,కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి,ముఫిసిల్ కమిటీ చైర్మన్ పేపర్ శ్రీనివాస్ తదితరులతో కలిసి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డి లను జర్నలిస్ట్ నాయకులు,సభ్యులు అభినందించారు.

## వ్యవసాయ పొలంలో బోరు వేయనీయడం లేదని..
# రైతు ఆత్మహత్యాయత్నం





- న్యాయం చేయాలంటూ.. అందరూ చూస్తుండగానే పెట్రోల్ పోసుకున్న బాధితుడు వల్లభాయ్

**చేవెళ్ల, మార్చి11(నినాదం న్యూస్):** తమ వ్యవసాయ పొలంలో బోరు వేయనీయడం లేదని మనస్థాపంతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించిన ఘటన చేవెళ్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని కేజీఆర్ గార్డెన్లో చేవెళ్ల మండలం నాంచెరి గ్రామానికి చెందిన దళిత యువకుడు వల్లభాయ్ అందరూ చూస్తుండగా ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేశాడు.అక్కడే ఉన్నా బాధితుడి బంధువులు గమనించి పెట్రోల్ బాటిల్ లాక్కొని తన ఒంటిపై నీరు పోసి కూర్చోబెట్టారు.బాధితుడు వల్లభాయ్ మాట్లాడుతూ..మాకు ఉన్న రెండు ఎకరాల లావణి పట్ట భూమిలో బోరు వేసి వ్యవసాయం చేసుకొని బ్రతుకుదాం అని అనుకుంటే మా గ్రామానికి చెందిన రాజకీయ నాయకుడు,చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా పదవిలో ఉన్న గడ్డమీది పెంటయ్య గౌడ్ కన్ను మా భూమి మీద పడిందో ఏమో అందుకనే మా భూమిలో రెండుసార్లు బోరు వేయనీయకుండా అధికారం అడ్డం పెట్టుకుని చేవెళ్ల పోలీసులకు పదేపదే ఫోన్ చేసి, పోలీసులతో బోర్వెల్యకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మాకు న్యాయం చేయండి అంటూ బోరున విలపించాడు.

**చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది పెంటయ్య గౌడ్ వివరణ కోరగా..**

గ్రామంలో లెవెల్ లో సమస్యలు మస్తు ఉంటాయ్.. అందరం పెద్ద మనుషులం కూర్చుని అన్ని మాట్లాడినం,ఆయన భూమిలో ఆయన ఏమైనా చేసుకొని ఆయన ఇష్టం అన్నాడు. ఇప్పుడు మీరు బోరు వేయకుండా అడ్డుకున్నందుకే అతను ఆత్మహత్యకు ప్రయత్నించాడు కదా అని అడిగితే ఇగ మీరు అడిగేదే అడుగుతుంటారు అంటూ వివరణ తెలిపారు.

# అడ్డగోలు వసూళ్లు..



- సమన్యాయం పాటించని మరిపెడ మున్సిపాలిటీ అధికారులు
- శాస్త్రీయంగా పన్నులు తీసుకుంటే అభివృద్ధికి సహకరిస్తాం
- మరిపెడ ఆస్తిపన్ను బాధితులు

**డోర్నకల్ /మరిపెడ మార్చ్ 11(నినాదం న్యూస్):** మరిపెడ ఇంటి పన్ను బాధితులు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని వాసవి క్లబ్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. మరిపెడ గ్రామపంచాయతీ నుండి మున్సిపాలిటీగా 2018లో ఏర్పాటు చేయడం జరిగిందని,2021 సంవత్సరంలో ఆస్తి పన్ను పెంచడం జరిగిందన్నారు..మరిపెడ మున్సిపాలిటీ కార్గిల్ సెంటర్ నుండి మహబూబాద్ అడ్డరోడ్డు రాజీవ్ సెంటర్ వరకు దాదాపుగా కమర్షియల్ 100 షాపులు ఉంటే కేవలం 20 షాపులకు మాత్రమే ట్యాక్సీలు పెంచి మూడు సంవత్సరాల నుండి వసూళ్లు చేయడం జరుగుతుందన్నారు... కమర్షియల్ షాపులపై 10 శాతం ట్యాక్సీలు పెంచి వసూలు చేయడం దాదాపుగా ఉమ్మడి వరంగల్,ఖమ్మం, నల్లగొండ,హైదరాబాద్ వంటి జిల్లాల్లో కూడా లేని విధంగా కేవలం మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోనే టాక్సీలను పెంచి వసూలు చేయడం దారుణమన్నారు.కేవలం 20 షాపులకే ట్యాక్సీలు పెంచి తీసుకుంటున్నారని,శాస్త్రీయంగా సమ న్యాయం పాటించకుండా గత మూడు సంవత్సరాల నుండి మిగతా షాపులకు పన్నులు పెంచకుండా, పన్నులు పెంచిన వారినే వసూలు చేసి ఇబ్బంది పెడుతున్నారన్నారు. సౌకర్యాలు సమానంగా ఉన్నప్పుడు పన్నులు కూడా అందరికీ సమానంగా ఉండాలన్నారు.ఒకే రోజు రాష్ట్రమంతటా కుల గణనలు చేస్తున్నప్పుడు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో ఇప్పటికే 3 సంవత్సరాల నుండి పన్ను వసూళ్ల విధానం అందరికీ ఒకే విధంగా ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.? కమర్షియల్ షాపులు కొలతలు వేసి శాస్త్రీయంగా సమ న్యాయంగా పన్నులు తీసుకుంటే అభివృద్ధికి సహకరించడానికి ముందు ఉంటామన్నారు. మున్సిపాలిటీ కమిషనర్,జిల్లా కలెక్టర్ ను కలిసి పన్నులు తగ్గించాలని ఫిర్యాదు చేస్తే పర్సనల్ గా కక్ష సాధింపు చర్యలో భాగంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అందరికీ సమానంగా కొత్త పన్నులు వేసి వసూళ్లు చేసినప్పుడే అందరితో పాటు సమానంగా చెల్లించడానికి ముందుంటామన్నారు.అప్పటి వారికి పాత విధానంలోనే పన్నులను వసూలు చేయాలన్నారు. రెసిడెన్షియల్ 120 గజాలకు మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో సంవత్సరానికి గాను పన్నులు 1600 వందల రూపాయలు, తొర్రూరు మున్సిపాలిటీలో 978 రూపాయలు, మహబూబాబాద్‌లో 1400 రూపాయలు, డోర్నకల్ లో 1484 రూపాయలు వసూళ్లు చేస్తున్నారని, అలాగే కమర్షియల్ బిల్లింగ్ లకు 120 గజాలకు మరిపెడలో 13460 రూపాయలు, మహబూబాబాద్‌లో 3158 రూపాయలు,తొర్రూర్ మున్సిపాలిటీలో 5705 రూపాయలు,డోర్నకల్ మున్సిపాలిటీలో 14000 వేల రూపాయలు సంవత్సరానికి గాను పన్ను రూపంగా వసూలు చేస్తున్నారన్నారు.ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో లేని విధంగా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో పన్నులు వసూలు చేయడం అది కూడా 20 షాపుల వారికే వసూలు చేయడం జరుగుతుందన్నారు... అందరికీ సమ న్యాయంగా పెంచిన తర్వాతనే కొత్త పన్నులు వసూలు చేయాలని అప్పటి వారికి ఎవరికి ఇబ్బందులకు గురి చేయవద్దన్నారు... పాత పన్ను విధానాన్ని అమలు చేయాలని కోరారు.మరిపెడ మున్సిపాలిటీ ఆదాయాన్ని పెంచడానికి కొత్తగా పర్మిషన్ లేని ఎన్నో బిల్డింగులు నిర్మించుకున్నారని అలాంటి వారికి ఎలాంటి పన్నులు విధించకుండా వాళ్ల జోలికి వెళ్లకుండా,పన్నులు పెంచిన వారికి మాత్రమే ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు.పన్ను వసూల్లో కొన్ని కమ్యూనిటీల జోలికి కూడా వెళ్లడం లేదన్నారు.ఎమ్మెల్యేను కలిసి ఈ సమస్యపై వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల నాగేశ్వరరావు, ఉప్పల వెంకటేశ్వర్లు,భువనగిరి సురేష్,వంగవీటి భద్రయ్య,ఊరుకొండ రాకేష్,వి నాగరాజు,బి సురేష్,కే మధు,పి రమేష్,ఊరుకొండ శ్రీనివాస్, తల్లాడ మురళి,గర్రెపల్లి వెంకన్న, కోరుకొండ శ్రీనివాస్,కారంపూడి చెన్నయ్య,కే ఉపేందర్,పాముల సురేష్,కారంపూడి భద్రయ్య,వై శ్రీనివాస్,వంగవీటి రాజ్ కుమార్, కారంపూడి వెంకటేశ్వర్లు,ఆనబత్తుల వీరన్న,తల్లాడ రంగయ్య,తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



**మల్లాపూర్, మార్చి 11 (నినాదం న్యూస్) :** మల్లాపూర్ మండలం కొత్త దాంరాజ్ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగారావు సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం ప్రారంభించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 3 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి గ్రామా అభివృద్ధికి సహకరించిన జువ్వాడి నర్సింగారావు కు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దం సుధాకర్, మాజీ సర్పంచ్ గజ్జి గంగా రెడ్డి, నిగ రవి, మల్లేష్, ఉడుత శ్రీకాంత్, ఉత్కం వరుణ్, వినోద్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు

## పాఠశాల విద్యార్థులకు..
# సౌండ్ సిస్టం వితరణ



**మల్లాపూర్, మార్చి 11 (నినాదం న్యూస్) :** పాతదాంరాజ్ పల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలకు మంగళవారం బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, ప్యాక్స్ డైరెక్టర్ సుతారి రాజేందర్ సౌండ్ సిస్టం ను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి మా గ్రామం నుంచి సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. పాఠశాల తరగతి గదుల్లో విద్యార్థులు రక్షణార్థం కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా గ్రామంలోని 1 నుంచి 5వ తరగతి చదివే ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి వరకు చదివే ప్రతి విద్యార్థికి 3వేలు అందజేస్తానని తెలిపారు. హెచ్ఎం వేణు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహాయం అందిస్తున్న ప్యాక్స్ డైరెక్టర్ సుతారి రాజేందర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి దాత సుతారి రాజేందర్ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ గజ్జి రాజారెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వనిత, నాయకులు కొండ మధు, ఉపాధ్యాయులు భవాని, అరుణ్, అనురాధ, జెమ్లానాయక్, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని మహిళను గుర్తించిన పోలీసులు



**భీమదేవరపల్లి మార్చి 11 (నినాదం న్యూస్):** మతిస్థిమితం సరిగా లేక నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర తండా చెందిన సభావత్ జిజాలి అనే మహిళ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముత్తారం చేరుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన ముల్కనూర్ పోలీసులు వివరాలు సేకరించారు. మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. నాగర్ కర్నూల్ టౌన్ లో మిస్సింగ్ కేసు ఉందని పోలీసులు తెలిపారు. రేపు ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు.

# ఆడుదాం ఆంధ్రాపై ఏసీబీ విచారణ

- నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు

**అమరావతి, మార్చి11(నినాదం న్యూస్):** వైసీపీ హయాంలో నిర్వహించి నటువంటి ఆడుదాం ఆంధ్రాపై విచారణకు ఏపీ ప్రభుత్వం ఎసిబి విచారణకు ఏపీ సర్కార్ ఆదేశించింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో జరిగిన అవకతవకలు, ఆరోపణలన్నింటిపై కూడా సమగ్ర విచారణ జరుగబోతోంది. ఏపీలో ఎన్నికలకు ముందు యువ ఓటర్లను టార్గెట్ చేస్తూ ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమం కింద దాదాపు రూ.119 కోట్లలో 45 రోజుల్లోనే ఖర్చు చేశారు. దీనికి సంబంధించి సోమవారం శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు ప్రశ్నించగా.. దానికి క్రీడాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సమాధానం ఇచ్చారు. కేవలం 45 రోజుల్లో రూ.119 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. కేవలం రూ.119 కోట్లే కాదు అంతకుమించి దీంతో కుంభకోణం జరిగిందిని సభ్యులు అభిప్రాయం వ్యక్తం చేశారు. దాదాపు రూ.400 కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని, కేవలం రూ.119 కోట్లకు సంబంధించి ఆడుదాం ఆంధ్ర ఖర్చు మాత్రమే కాదు జిల్లా ఫండ్స్ కూడా దీనికి పూర్తి స్థాయిలో ఖర్చు చేశారనే అనుమానాలను వ్యక్తం చేశారు. ఈ స్కామ్‌పై సమగ్రమైన విచారణ జరపించాలని ఎమ్మెల్యేలు గౌతు శిరీష, భూమా అఖిలప్రియ కోరారు. ÷ఖనిపై వెంటనే స్పందించిన సర్కార్ ఆడుదాం ఆంధ్రాలో అవకతవకలపై విచారణకు ఆదేశిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏసీబీ విచారణ చేసి ఆడుదాం ఆంధ్రాలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకునేలా సిఫారసు చేస్తారని సమాచారం. ఆడుదాం ఆంధ్రాలో అనే కార్యక్రమం పెట్టి భారీ ఎత్తు ఖర్చుల చేశారని, అంతే కాకుండా క్రీడాకారులను అపహాస్యం చేశారని, ఎన్నికలకు ముందు యువతను ప్రలోభపెట్టే విధంగా ఈ క్రీడా సంబరం నిర్వహించారని ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా ముగింపు కార్యక్రమానికి రెండు కోట్లు కేటాయించి.. తర్వాత ఆఖరి నిమిషానికి మరో మూడు కోట్లు పెంచినప్పటికీ కూడా ముఖ్యమంత్రి ఆ కార్యక్రమానికి హాజరుకాలేదని తెలుస్తోంది. వ్యవహారంలో కేవలం 45 రోజుల్లో విలువైన ప్రజాధనాన్ని పూర్తి స్థాయిలో దుర్వినియోగం చేశారని అనే అనుమానాలను శాసనసభలో సభ్యులు వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి స్థాయి విచారణకు మంత్రి కూడా సన్నద్ధమైనట్లు తెలుస్తోంది. ఆడుదాం ఆంధ్రాలో భారీ ఎత్తున ఖర్చు చేశారని, కిట్ల రూపంలో నాశిరకమైన సరుకులను కొనుగోలు చేసి కమిషన్లు కొల్లగొట్టారనే అనుమానాలు ఉన్నాయి. అప్పట్లో మంత్రిగా పనిచేసిన రోజాపై కూడా అనేక అభియోగాలు నమోదు అయ్యాయి. ఈ క్రమంలో మొత్తం వ్యవహారంపై పూర్తిస్థాయిలో ఏసీబీ విచారణ జరిపించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఏసీబీ రిపోర్టు వచ్చాక బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది.

# అంగన్‌వాడీలను మోసం చేసిన ప్రభుత్వం

- సమస్యలపై నిలదీస్తే అణచివేస్తారా?
- మీడియా సమావేశంలో మండిపడ్డ షర్మిల



**విజయవాడ, మార్చి11(నినాదం న్యూస్):** అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు వారికి తీరని అన్యాయం చేస్తోందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా ఆరోపించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. మాట తప్పి మోసం చేయడం అంటే ఇదేనని.. తమ గోడు వినిపించాలనుకున్న అంగన్‌వాడీలను ఎక్కడికక్కడ నిర్బంధించడం నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. వారి గొంతు నొక్కి, ఆందోళలను అణిచివేయడం కూటమి ప్రభుత్వ నియంత చేష్టలకు పరాకాష్ట అని అన్నారు. అంగన్‌వాడీల డిమాండ్లు పూర్తిగా న్యాయబద్ధమైనవని.. వెంటనే వారిని పిలిచి ప్రభుత్వం చర్చలు జరపాలని షర్మిల డిమాండ్ చేశారు. ంగన్‌వాడీలకు నెలకు గౌరవ వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, తక్షణం గ్రాట్యూటి చెల్లింపు హామీని అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా పరిగణించాలని, హెల్పర్ల పదోన్నతిపై నిర్దిష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. అలాగే పెండింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని.. విధి నిర్వహణలో అంగన్‌వాడీలు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగంతో పాటు మట్టి ఖర్చుల కింద రూ. 20 వేలు ఇవ్వాలన్నారు. వీటితో పాటు ఇతర 12 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే దీనిపై ప్రకటన చేయాలని.. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని వైఎస్ షర్మిల అన్నారు.

# పద్మశాలీలకు సీఎం రేవంత్ బహిరంగ క్షమాపణ చెప్పాలి

- పద్మశాలి సంఘం నేతల డిమాండ్

**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** హైదరాబాదులో ఇటీవల అఖిలభారత పద్మశాలి సంఘం, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్మశాలీలను అవమానపరిచే విధంగా చేనేత మగ్గంపై కాళ్ళకు షూ వేస్కొని కూర్చోవడం పద్మశాలీల మనోభావాలను దెబ్బతీశాయని మంగళవారం రోజున పద్మశాలి రాష్ట్ర నాయకుడు అడిచర్ల రాజు ఆధ్వర్యంలో కరీంనగర్ లోని తెలంగాణ చౌరస్తా వద్ద చేనేత మగ్గం ను పసుపు నీళ్లతో శుద్ధిచేసి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడిచర్ల రాజు మాట్లాడుతూ,పద్మశాలిల మనోభావాలను దెబ్బతీసిన సీఎం రేవంత్ రెడ్డి తమ కులస్తులకు బహిరం



గంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

అలాగే పద్మశాలి చేనేతలకు రైతు భీమా తరహాలో చేనేత భీమా సౌకర్యం కల్పించి, సిఎం ప్రకటించిన రుణమాఫీ వెంటనే అమలు అయ్యే విధంగా జీఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కరీంనగర్ పట్టణ పద్మశాలి సంఘం, ప్రధాన కార్యదర్శి వంగర ఆంజనేయులు, కోశాధికారి గజవెల్లి కనకయ్య, ఉపాధ్యక్షులు తేళ్ల చంద్రశేఖర్ ఎలిగేటి శ్రీనివాస్, దుబాల శ్రీనివాస్, గుంజేంటి శివకుమార్, ఘర్దస్ సతీష్, రాష్ట్ర నాయకుడు అడిచెర్ల శ్రీనివాస్, మాసం గణేష్, ఏలిగేటి శ్రీనివాస్, ఆడెపు కమలాకర్ మామడాల ప్రభాకర్ సొల్లేటి శుభాష్ దుస సుధాకర్ కొండ రాజు రాజేశం చామనపల్లి పద్మశాలి సంఘం కార్యదర్శి దుడం శ్రీనివాస్, పద్మశాలి నాయకులు , కార్యకర్తలు కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు బిడ్డకు గ్రూప్2లో రాష్ట్రస్థాయిలో 95వ ర్యాంకు

- ప్రశాంత్ రెడ్డి కుటుంబంలో వెల్లి విరిసిన ఆనందం



**జమ్మికుంట, మార్చి 11 (నినాదం న్యూస్) :** వ్యవసాయ కుటుంబానికి చెందిన కాంతాల సాయి ప్రశాంత్ రెడ్డి గ్రూప్ 2 పరీక్షలు ఫలితాలలో స్టేట్ 95 వ ర్యాంకు సాధించాడు.గ్రూప్ 2 ఫలితాలలో ఇల్లందకుంటకు చెందిన కాంతాల మల్లారెడ్డి రజిత దంపతుల కుమారుడు కాంతాల సాయి ప్రశాంత్ రెడ్డి స్టేట్ 95 వ ర్యాంకు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయి ప్రశాంత్ రెడ్డి మొన్నటి గ్రూప్ 4 ఫలితాలలో కూడా ఉద్యోగ సంపాదించాడు. గ్రామీణ ప్రాంత వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయి ప్రశాంత్ గ్రూప్ 2 లో స్టేట్ 95 వ ర్యాంకు సాధించడం పట్ల గ్రామ ప్రముఖులు బంధు మిత్రులు విస్ డమ్, చాణిక్య విద్యాసంస్థల యాజమాన్యం శుభాకాంక్షలు తెలియజేశారు.

## అంగరంగ వైభవంగా శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి కల్యాణ మహోత్సవం



**జమ్మికుంట, మార్చి11 (నినాదం న్యూస్) :** ఇల్లంతకుంట మండలం చిన్న కోమటిపల్లి గ్రామంలో వెలిసిన స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా వేద మంత్రోత్సనుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారులు ప్రదీప్ శర్మ నవీన్ శర్మ ఆధ్వర్యంలో కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించగా భారీ ఎత్తున భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఇల్లందకుంట మండలంలోని చిన్న కోమటిపల్లి గ్రామంలో స్వయంభుగా వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ మహెూత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వయంభు లక్ష్మి నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా లక్ష్మీనరసింహస్వామిని పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి హనుమాన్ దేవాలయంలో ఎదుర్కోళ్లను నిర్వహించి గ్రామంలోని పురవీధుల గుండా కోలాట నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ పూజారులు ప్రదీప్ శర్మ ఇల్లందకుంట పూజారులు నవీన్ శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ ఘట్టాన్ని వేదమంత్రోచ్ఛరణల మధ్య కనుల పండుగ వందలాది మంది భక్తులు వీక్షిస్తుండగా జరిపించారు. ఆలయ చైర్మన్ చిట్ల చంద్రమౌళి దంపతులు, చుక్క అరుణ రాణి రంజిత్ కుమార్, చుక్క రజిత వేణుగోపాల్, స్వామివారికి కల్యాణ పట్టువస్త్రాని సమర్పించారు ,వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కళ్యాణాన్ని తిలకించారు. లక్ష్మీనరసింహస్వామి నామస్మరణతో ఇల్లంతకుంట మండలంలోని చిన్నకొమటిపల్లి గ్రామం మారుమ్రోగింది. అనంతరం ఆలయంలో అన్న ప్రసాద వితరణ చేపట్టారు .ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెట్ల చంద్రమౌళి, వైస్ చైర్మన్ ముడెడ్ల రమేష్ ,కోశాధికారి చుక్క వెంకటేశ్వర్లు,మహా అన్న ప్రసాద వితరణ చుక్క అరుణ రాణి రంజిత్ కుమార్, కళ్యాణ మండపం టెంట్ హౌస్ సామాగ్రి దాదా చుక్క రజిత వేణుగోపాల్, ఆలయ ఆర్చ్ అలంకరణ దాత జవ్వాజి వాణి వేణు, డైరెక్టర్లు చిట్ల శ్రీనివాస్, మూడెడ్ల రమేష్, మూడేళ్ల శ్రీనివాస్, నెల్లి శేషు ,బుర్ర రఘు, కొత్తపల్లి శంకర్ ,గూడెపు రమేష్ ,మారేపల్లి రాజయ్య, తోపాటు గ్రామ ప్రజలు భక్తులు పాల్గొన్నారు.

## వడ దెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


- హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి
- ఉపాధి కూలీలకు ఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**జమ్మికుంట, మార్చి 11 (నినాదం న్యూస్) :** వేసవి ఎండల తీవ్రతకు ఉష్ణోగ్రతలు పెరగటం వల్ల ప్రజలు వడ దెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ ఎ మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విలాసాగర్ గ్రామములో వ్యవసాయ ఉపాధి హామీ కూలీలకు వడ దెబ్బ పై ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ అవగహన కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి ఉపాధి హామీ కూలీలకు వడ దెబ్బ లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను క్లుప్తంగా వివరించి చెప్పినారు. వడ దెబ్బ నివారణకై ప్రజలు కూలీలు అందరూ రోజుకి 10 గ్లాసుల కన్నా ఎక్కువ నీరు త్రాగాలని, బయటికి వెళ్లి నప్పుడు గొడుగు, టోపీ, తలపాగ, తెల్లని కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. ఉదయం మరియు సాయంత్రం ఎండ లేని సమయంలో పనులు చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఎండ వేడిమికి డి హై డ్రెషన్ కాకుండా ఉండడానికి ఓ ఆర్ ఎస్ ద్రావణాన్ని త్రాగాలని సూచించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలందరికి ఓ ఆర్ ఎస్ పాకెట్స్ ని పంపిణీ చేసినారు. ఈ కార్యక్రమములో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ రత్న కుమారి, ఏఎన్ఎం సౌందర్య, మంజుల ఆశా వర్కర్ ఫీల్డ్ అసిస్టెంట్ సుధాకర్ ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు

## ఉపాధి హామీ పనుల్లో సొమ్ము కేంద్రానిదైతే సోకులు రాష్ట్ర ప్రభుత్వంవి

- గ్రామాల్లో సమస్యలు రాజ్యమేలుతుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం చోద్యం చూస్తుంది
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** కంద్ర ప్రభుత్వ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా నేడు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, గ్రామాలకు ఈజీఎస్ నిధులే నేడు పెద్దదిక్కుగా మారాయని , గ్రామాల్లో అంతర్గత రహదారుల అభివృద్ధి నిర్మాణం కోసం కేంద్రం సొమ్ము కేటాయిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఈజీఎస్ పనులు తమ ఘనత అన్నట్టు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తూ కాంగ్రెస్ సోకులు పడుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఘాటుగా విమర్శించారు. మంగళవారం రోజున వీణవంక మండలంలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన పలు పనులను గంగా డి కృష్ణారెడ్డి స్థానిక బిజెపి శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రజలను మభ్య పెట్టడానికి కాంగ్రెస్ అనేక ప్రయత్నాలు చేస్తుందన్నారు. స్థానిక సంస్థలను , ముఖ్యంగా గ్రామ పంచాయతీలను ఉత్సవ విగ్రహంల కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందని ఆయన దుయ్యబట్టారు. భారతదేశంలో స్థానిక సంస్థలకు, గ్రామపంచాయతీలకు ప్రజా ప్రతినిధులు లేని ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమేనన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అడ్డగోలుగా హామీలిచ్చి, ఆరుగ్యారెంటీలతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన కాంగ్రెస్ సర్కార్ నేడు మళ్లీ గ్రామ ప్రజలను మోసం చేయడానికి అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందని మండిపడ్డారు. ప్రస్తుతం ఈజీఎస్ నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అంతర్గత రహదారులు , ఇతర పనులను కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిగా చిత్రీకరించుకుంటూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడానికి సిగ్గుండాలన్నారు. గ్రామాల్లో మండలాల్లో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని, జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన తప్పిదాలను , మోసాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతినిత్యం అనేక రాజకీయ డ్రామాలు చేస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వీణవంక భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బత్తిని నరేష్ గౌడ్ జిల్లా కార్యదర్శి సిహెచ్ నరసింహ రాజు ఆదిరెడ్డి పెద్ది మల్లారెడ్డి గొడుగు వినోద్ శ్రీనివాస్ యాదవ్ దాసరి భాస్కర్ శ్రీనివాస్ రెడ్డి సిహెచ్ కొండల్ రెడ్డి ముత్యాల రవీందర్ తిరుమల్ మారం తిరుపతిరెడ్డి హరీష్ ఉట్ల కుమార్ మహంకాళి శ్రీనివాస్ పోలువదలు భూతు అధ్యక్షులు కర్రె నాని మోటం శ్రీనివాస్ పూదరి అనిల్ కర్ర రమణారెడ్డి కొలి పాక శ్రీనివాస్ గూడపు శివ ప్రశాంత్ రాజు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలి

- డాక్టర్ ప్రసన్న హరికృష్ణ



**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తు విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పోటీ చేసిన డాక్టర్ ప్రసన్న హరికృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ వనరులు అభివృద్ధి చెందాలంటే విద్యా, ఆరోగ్యం, ఉపాధి రంగాలకు అధిక నిధులు కేటాయించాలన్నారు. నీళ్లు, నిధులు, నియమాకాలు ఏజెండాగా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నప్పటికి గత 10 సంవత్సరాలుగా విద్యారంగానికి చాలిచాలని నిధులు కేటాయించడం శోచనీయమన్నారు. దేశ సగటు బడ్జెట్ నిధులు విద్యారంగానికి 14.7 శాతం కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో గత 10 సంవత్సరాల కాలంలో కేవలం సగటున 6.6 శాతం నిధులు కేటాయిస్తే ప్రస్తుత ప్రభుత్వం గత సంవత్సర బడ్జెట్‌లో ఒక శాతం పెంచి 7.75 కేటాయించి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. పాఠశాలల్లో విద్యార్థులు వాష్ రూమ్‌లకు వెళ్లాలంటే క్యూలో నిలుచొనే దుస్థితి ఉందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు విద్యారంగ అభివృద్ధికి తమ బడ్జెట్‌లో రెండంకెల నిధులు కేటాయిస్తుంటే మన రాష్ట్రంలో అందులో సగం కూడ కేటాయించకపోవడాన్ని ఆయన ఏద్దేవా చేసారు. మానవ వనరుల పెంపులో విద్య,వైద్యం పాత్ర ఎనలేనిది అని అన్నారు. దక్షిణ భారత్‌లోని అంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రంలో డబుల్ డిజిట్ సంఖ్యలో విద్యారంగానికి నిధులు కేటాయిస్తే మన రాష్ట్రంలో మాత్రం సింగిల్ డిజిట్ కేటాయింపులు చేయడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా విద్యారంగానికి ఈ బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని, విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మానవ వనరుల అభివృద్ధికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యమంలో ప్రసన్న హరిక్రిష్ణ టీం సభ్యులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేసిన సుడా చైర్మన్

- కాంట్రాక్టర్ అధిక లాభాపేక్ష లేకుండా నాణ్యమైన సరకులు అందించాలి
- పలు సూచనలు చేసిన కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, మార్చి11(నినాదంన్యూస్):** నగరంలోని మహాత్మా జ్యోతిబా పూలే బలహీన వర్గాల సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల విద్యార్థినులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా వంటశాలలోని సరుకులను పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మెస్ చార్జీలు పెంచడం వల్ల పౌష్టికాహారం అందించగలుగుచున్నామని గతంలో ఇటువంటి పరిస్థితి ఉండేది కాదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. భోజనం చేస్తూ విద్యార్థినులతో మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ నాణ్యత విషయంలో రాజీ పడొద్దని కాంట్రాక్టర్ సరఫరా చేసే సరుకులు నాణ్యతతో ఉండేలా నిరంతర పర్యవేక్షణ చేయాలని నరేందర్ రెడ్డి సూచించారు. చిన్న చిన్న లోపాలు గుర్తించామని వాటన్నిటిని సరిచేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించిన మెనూను నాణ్యతతో అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మెండి చంద్రశేఖర్,మిరాజ్, జిల్లా ఎస్సీ,ఎస్టీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్,శ్రవణ్ నాయక్,కుర్ర పోచయ్య, పెద్దిగారి తిరుపతి,కొట్టె ప్రభాకర్,కీర్తి కుమార్,అష్రఫ్ ఖురేషి,రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## పది పరీక్షలు పదిలంగా రాయండి

- పరీక్షలను భయంతో కాకుండా బాధ్యతతో రాయాలి
- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్లపల్లి నాగరాజు
- పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పెన్నులు పంపిణీ




**జమ్మికుంట, మార్చి 12 (నినాదం న్యూస్) :** యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణం మండల లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో సుమారుగా 250 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, స్కెల్ విద్యార్థులకు ఉపయోగపడే పలు వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులగా విచ్చేసిన పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... చదువుతోనే బంగారు భవిష్యత్తు కు బాటలు వేసుకోవచ్చని విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు రాణించాలని 10 వ తరగతి తోనే భవిష్యత్ కు తొలిమెట్టని అన్నారు. అదే విధంగా పదవ తరగతి లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పర్లపల్లి నాగరాజు మాట్లాడుతూ.. పరీక్షలను భయంతో కాకుండా బాధ్యతతో రాయాలని భయపడితే అనుకున్న లక్ష్యాన్ని సాధించ లేమని ఆయన విద్యార్థులకు సూచించారు. పదవ పరీక్షల్లో కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట మండలం అగ్రగామిగా నిలవాలని ఆకాంక్షించారు. అదే విధంగా 10/10 సాధించిన విద్యార్థులకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే విధంగా బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి, జమ్మికుంట ఇల్లందకుంట దేవస్థానం మాజీ చైర్మన్ దేశిని కోటి, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మొలుగురి సదయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుడిగే శ్రీకాంత్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి రేణుకా, ఫిషరీష్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పింగిలి రాకేష్ యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గంగారపు మహేష్, మండల ఉపాధ్యక్షులు రాచపల్లి సాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు పంజాల అజయ్, చెన్నావేనా రమేష్, శనిగరపు తరుణ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాతకాల అనిల్, దిడ్డి రాము, శ్రీహరి దొడ్డే నవీన్, ఏభూషి అజయ్, పాతకాల రమేష్, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ ముఠ అరెస్ట్ : సీఐ నిరంజన్ రెడ్డి



**కోరుట్ల, మార్చి 11 (నినాదం న్యూస్) :** ప్రభుత్వ అధికారిని బెదిరించి డబ్బులు వసూలు చేసిన రౌడీషీటర్ ముఠాను అరెస్ట్ చేసి 80 వేల రూపాయలు, రెండు ఫోన్ లను స్వాధీనం చేసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు. మెట్పల్లి ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలలో గత కొంతకాలంగా అక్రమ ఇసుక మొరం రవాణా భూ సెటిల్మెంట్ లు చేస్తు, వారి అక్రమాలపై తిరగబడ్డ వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టమని బెదిరింపులకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసినట్లు మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెట్పల్లి మండలం రాజేశ్వరరావు పేట గ్రామానికి చెందిన రేంజర్ల అజయ్, ఎన్నం రమేష్, మెట్పల్లి పట్టణానికి చెందిన భత్తుల భరత్, జెట్టి లక్ష్మణ్ లు ముఠగా ఏర్పడి కొత్త కాలంగా అక్రమంగా పురం రవాణా చేస్తూ సెటిల్మెంట్ దందాలు నిర్వహిస్తున్నారు. అమాయకులను బెదిరిస్తున్నారు ఎవరైనా మాట వినకపోతే వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తున్నారు. కాగా గత నెల 12వ తేదీన రాజేశ్వరరావు పేట గ్రామంలో రేంజర్ల అజయ్ మొరం రవాణా చేస్తుండగా మెట్పల్లి ఇరిగేషన్ డిఈఈ అరుణోదయ్ కుమార్, వర్క్ ఇన్స్పెక్టర్ లక్ష్మయ్యలు అడ్డుకున్నారు. అజయ్ ఈ విషయాన్ని రమేష్ కు ఫోన్ ద్వారా తెలుపగా అతను అక్కడికి వచ్చి వారి అక్రమ రవాణాకు అడ్డుకుంటే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతానని డిఈఈ దూషించాడు. దానితో డిఈఈ అతని సిబ్బంది భయపడి వెళ్లిపోయారు. అనంతరం భత్తుల భరత్ డిఈఈ అరుణోదయ్ కు ఫోన్ చేసి మా వారిని ని కులం పేరుతో తిట్టావని నీపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెడతామని లేదంటే మూడు లక్షల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మళ్లీ రెండు రోజుల తర్వాత జెట్టి లక్ష్మణ్ అరుణోదయ్ కు ఫోన్ చేసి వెంకట్రావుపేట్ పిట్ట వద్దకు వచ్చి మాట్లాడాలని సమస్యను పరిష్కరించుకోవాలని లేకపోతే చంపుతానని బెదిరించాడు. దీంతో భయపడిన డిఈఈ అరుణోదయ్ భత్తుల భరత్ కు ఫోన్ ద్వారా లక్ష పదివేల రూపాయలు, లక్ష్మణ్ కు 40 వేల రూపాయల నగదు ఇచ్చాడు. ఇదేవిధంగా తరచు వారు ఫోన్ చేస్తూ అరుణోదయ్ ను బెదిరించడంతో , వారి వేధింపులు తట్టుకోలేక ఈనెల 6న ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న ఇబ్రహీంపట్నం ఎస్సై అనిల్ దర్యాప్తు చేసి, సోమవారం గండి హనుమాన్ దేవాలయం వద్ద అజయ్, భరత్, లక్ష్మణులను అదుపులోకి తీసుకొని వారి నుండి 80 వేల రూపాయల నగదు రెండుఫూలను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. పరారీలో ఉన్న ఎన్నం రమేష్ ను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆయన తెలిపారు. బత్తుల భరత్ అనే వ్యక్తి గతంలో వివిధ నేరాలకు పాల్పడగా అతనిపై మెట్పల్లి పోలీస్ స్టేషన్లో రౌడీషీట్ తెరిచారు. మెట్పల్లి సర్కిల్ పరిధిలో అక్రమ ఇసుక మొరం రవాణా, భూముల సెటిల్మెంట్ దంతాలకు పాల్పడి ప్రజల నుండి డబ్బులు వసూలు చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా సిఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.


## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- టీఎన్జీవో భవన్లో ఘనంగా మహిళా దినోత్సవం
- జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ




**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని జిల్లా ప్రిన్సిపాల్ జడ్జి ప్రతిమ అన్నారు. గెజిటెడ్ అధికారుల యూనియన్, నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవన్లో మంగళవారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ, మహిళలు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. బాలురతో సమానంగా బాలికలను పెంచి ఉన్నత చదువులు చెప్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. చదువుతోనే సమాజంలో గౌరవం, గుర్తింపు వస్తాయని, ఉన్నత చదువులు చదవాలని బాలికలకు సూచించారు. మహిళలు ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని, అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. మహిళలకు ఉన్న అవకాశాలను సద్విని యోగం చేసుకుంటూ లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. ఇంటి పనులు, ఉద్యోగ విధులతో సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. ఉన్నత చదువులు, ఆర్థిక అభివృద్ధి సాధిస్తే మహిళా సాధికారత వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి సంగెమ్ లక్ష్మణరావు, ఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు మడిపల్లి కాళీ చరణ్, అడ్ల రవీందర్ పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే రసమయిని విమర్శిస్తే ఊరుకోం



**కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్) :** కాంగ్రెస్ నాయకులు ఒళ్ళు దగ్గర పెట్టుకోవాలని. మాజీ ఎమ్మెల్యే రసమయి అన్ననీ విమర్శిస్తే ఊరుకోమని. మానకొండూర్ మాజీ జెడ్పిటీసి సభ్యులు తాళ్లపెల్లి శేఖర్ గౌడ్ అన్నారు. బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన వేలేకరుల సమావేశం లో మాట్లాడుతూ కమిషన్ల పరమా విధిగా కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని గల్లి నుంచి ఢిల్లీ దాకా –వినబడుతుంది. మండలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు. చర్చకు సిద్ధమా అన్నారు. సహకార సంఘాల్లో బిఆర్ఎస్ నేతలు ఉన్న కాడ ఇబ్బందులు పెట్టి రాజకీయం చేస్తున్నారు. ప్రజలే మీకు గుణపాఠం చెప్తారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులే కోడైకొస్తున్నారు ఎక్కడబడితే అక్కడ డబ్బు వసూలు చేస్తున్నారని. మా ఎమ్మెల్యే డబ్బు లేనిదే పనిచేస్తలేడు అని. నియోజకవర్గంలో ఏ చెట్టును అడిగిన పుట్టనడిగినా చెప్తారు ఎమ్మెల్యే గారి అవినీతి గురించి, అధికారం ఎవరికి శాశ్వతం కాదు గుర్తుపెట్టుకోండి. ఇప్పటికైనా చిల్లర విమర్శలు మాట పద్ధతి మార్చుకోకపోతే ప్రజల్లో మిమ్మల్ని దోషులుగా నిలబెడతాం. విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ అధికార ప్రతినిధి శతరాజు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# నిమ్మకాయ నీరు ప్రయోజనాలెన్నో..!

**ప్రతిరోజు నిమ్మకాయను తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నిమ్మకాయను ఆహారంలో లేదా పానీయాలలో చేర్చుకోవడం వల్ల శరీరానికి కావలసిన అనేక పోషకాలు అందుతాయి. దీని వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా శక్తి, మానసిక స్థితి వంటి అంశాలపై కూడా ప్రభావం చూపుతుంది.**

**కీళ్ల ఆరోగ్యం**

నిమ్మకాయలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు కీళ్ల మంటను తగ్గిస్తాయి. దీనివల్ల కీళ్ల నొప్పులతో బాధపడే వారు ఉపశమనం పొందుతారు. ముఖ్యంగా ఆర్థరైటిస్ వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందడంలో ఇది సహాయపడుతుంది. నిత్యం నిమ్మకాయ నీటిని తీసుకోవడం ద్వారా కీళ్ల కదలిక మెరుగుపడుతుంది. వాపు కూడా తగ్గుతుంది.

**మానసిక స్థితి**

నిమ్మకాయ సువాసన, సిట్రస్ లక్షణాలు మానసిక ఆరోగ్యంపై గొప్ప ప్రభావాన్ని చూపుతాయి. ఒత్తిడి తగ్గించడం ద్వారా మనసు ప్రశాంతంగా ఉండేందుకు ఇది సహాయపడుతుంది. ఇందులో ఉన్న విటమిన్ సి కార్టిసాల్ స్థాయిలను తగ్గించి మనసు నిశ్చలంగా ఉండేలా చేస్తుంది.

**శరీర హైడ్రేషన్**

నిమ్మకాయ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తుంది. శరీరంలోని %జూ౨% స్థాయిలను సమతుల్యం చేయడంతో పాటు నీటి శోషణను కూడా పెంచుతుంది. రోజూ నీటిలో నిమ్మకాయను జోడించి తాగడం వల్ల శరీరంలో తేమ సమతుల్యం కాపాడుకోవచ్చు.

**రోగనిరోధక శక్తి**

నిమ్మకాయలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. తరచూ జలుబు లేదా వాతావరణ మార్పుల వల్ల ఇబ్బందులు పడేవారికి నిమ్మకాయ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల ఇమ్యూనిటీ మెరుగుపడుతుంది.

**శక్తి పెరుగుదల**

విటమిన్ సి శరీరంలో శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. నిమ్మకాయ తీసుకోవడం వల్ల శక్తి స్థాయి మెరుగుపడటం వల్ల రోజంతా ఉల్లాసంగా ఉండొచ్చు. అదనంగా ఇది ఆహారంలోని పోషకాలను శరీరానికి అందజేయడంలో సహాయపడుతుంది.

**బరువు తగ్గడం**

నిమ్మకాయలో ఉండే పెక్టిన్ అనే ఫైబర్ కంటెంట్ ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. దీని వల్ల కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీంతో అధిక ఆహారం తీసుకోవడాన్ని తగ్గించి బరువు తగ్గడంలో సహకరిస్తుంది. అలాగే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచుతుంది.

**చర్మ ఆరోగ్యం**

నిమ్మకాయలో ఉండే విటమిన్ సి చర్మానికి కావలసిన కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది. దీని వల్ల మచ్చలు, ముడతలు తగ్గిపోతాయి. నిమ్మకాయ తీసుకోవడం ద్వారా చర్మం ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా కనిపిస్తుంది.

**జీర్ణక్రియ**

నిమ్మకాయలో ఉండే సిట్రిక్ ఆమ్లం జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కడుపులో ఆమ్లాలు సమతుల్యంగా ఉండేలా చేయడం ద్వారా, ఆహారం సమర్థవంతంగా జీర్ణం అవుతుంది. ఈ విధంగా ఉబ్బరం, యాసిడ్ రిఫ్లక్స్ వంటి సమస్యలు తగ్గుతాయి. ప్రతిరోజూ నిమ్మకాయ తీసుకోవడం వల్ల కేవలం శరీర ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యంపై కూడా పాజిటివ్ ప్రభావం చూపుతుంది

**నోటి పరిశుభ్రత**

**నిమ్మకాయలో సహజంగా ఉండే యాంటీ బాక్టీరియల్ లక్షణాలు నోటి పరిశుభ్రతను మెరుగుపరుస్తాయి. ఇది శ్వాసను తాజాగా ఉంచడంలో సహాయపడుతుంది. నిమ్మకాయలోని ఆమ్లత్వం నోటిలో లాలాజల ఉత్పత్తిని పెంచి బ్యాక్టీరియాను తొలగిస్తుంది.**



# లివర్‌ను కాపాడుకుందాం..ఇలా..!



**ఫ్యాటీ లివర్ అనేది లివర్‌లో కొవ్వు పేరుకుపోయే పరిస్థితి. దీనికి ప్రధాన కారణాలు శరీరానికి సరైన ఆహారం లేకపోవడం, శారీరక కార్యకలాపాలు తక్కువగా ఉండడం, ఊబకాయం. ఫ్యాటీ లివర్‌ను అలాగే వదిలేస్తే అది లివర్ వాపు, సిర్రోసిస్, లేదా లివర్ వైఫల్యం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. అయితే సరైన ఆహారపు మార్పులతో ఈ వ్యాధిని నియంత్రించవచ్చు. కొంత శ్రమతో, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ద్వారా ఫ్యాటీ లివర్ సమస్యను తగ్గించుకోవచ్చు.**

## లివర్ ఆరోగ్యాన్ని మెరుగుపరిచే అద్భుతమైన ఆహారాలు ఇవే..!

**ఆకుకూరలు**



పాలకూర, లెట్యూస్, కాలే వంటి ఆకుకూరలు యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్‌లతో నిండి ఉంటాయి. ఇవి కాలేయంలో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వీటిలో నైట్రేట్, పాలీఫెనాల్స్ లభిస్తాయి. ఇవి లివర్ నిర్విషీకరణలో ముఖ్యపాత్ర వహిస్తాయి. ఈ ఆకుకూరలు రోజువారీ ఆహారంలో భాగం చేస్తే లివర్ కొవ్వును నియంత్రించుకోవచ్చు.

**డ్రై ఫ్రూట్స్**



బాదం, వాల్‌నట్‌లలో ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ E పుష్కలంగా కలిగి ఉంటాయి. ఈ డ్రై ఫ్రూట్స్ లివర్ మీద ఒత్తిడిని తగ్గించి దానిని శక్తివంతంగా పనిచేయడానికి సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ తీసుకోవడం వల్ల శరీరంలో ఉన్న ఇన్ఫ్లమేషన్ తగ్గిపోతుంది.

**కాఫీ**



కాఫీ తీసుకోవడం వల్ల లివర్ ఎంజైమ్‌లు, వాపు సమస్యలు తగ్గిపోతాయి. పలు పరిశోధనలు, కాఫీ లివర్ మీద శుభ్రప్రభావం చూపుతుందని సూచిస్తున్నాయి. కాఫీని నియమిత మోతాదులో తీసుకుంటే లివర్ ఫైబ్రోసిస్‌ను తగ్గించుకోవచ్చు.



**కొవ్వు చేపలు**

ఒమేగా-3 కొవ్వులు అధికంగా ఉండే చేపలు లివర్ ఆరోగ్యానికి చాలా మంచివి. వీటిలోని ఒమేగా-3లు వాపును తగ్గించి లివర్ లో కొవ్వు పేరుకుపోవడాన్ని నియంత్రిస్తాయి. అలాగే ట్రైగ్లిజరైడ్ స్థాయిలను తగ్గించడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి.

**ఆలివ్ ఆయిల్**



ఆలివ్ నూనెలో ఉన్న మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, యాంటీఆక్సి డెంట్లు లివర్ మీద మంచి ప్రభావం చూపిస్తాయి. ఈనూనె వాడటం వల్ల లివర్ శక్తివంతంగా పని చేస్తుంది. దానివాపు సమస్యలు కూడా తగ్గుతాయి.

**వెల్లుల్లి**



వెల్లుల్లి లివర్ లో శక్తివంతమైన నిర్విషీకరణ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇవి శరీరంలో ఉండే వాపు సమస్యలను తగ్గించి లివర్ ను ఆరోగ్యంగా ఉంచుతాయి. వెల్లుల్లి శక్తివంతమైన శోథ నిరోధక లక్షణాలు లివర్ లో కొవ్వు పేరుకుపోవడాన్ని తగ్గించడంలో సహాయపడతాయి.

**బెర్రీలు**



బ్లూబెర్రీలు, స్ట్రాబెర్రీలు వంటి బెర్రీలు యాంటీ ఆక్సిడెంట్లు, పాలీఫెనాల్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇవి లివర్ కణాలను దెబ్బతినకుండా కాపాడుతాయి. బెర్రీలను తరచుగా తీసుకోవడం వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది.

**పసుపు**



పసుపులో ఉండే కర్కుమిన్ అనేది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది లివర్‌లో కొవ్వు పేరుకుపోవ డాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. పసుపు వినియోగం లివర్ పనితీరును మెరుగుపరచడంలో కీలక పాత్ర వహిస్తుంది.

**గ్రీన్ టీ**



గ్రీన్ టీ కాటెచిన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా కలిగి ఉంటుంది. ఇవి లివర్ లో కొవ్వు పెరుగుదలను తగ్గించడంలో సహాయపడతాయి. పలు అధ్యయనాలు గ్రీన్ టీని క్రమం తప్పకుండా తీసుకుంటే లివర్ ఆరోగ్యానికి మేలు చేస్తుందని సూచిస్తున్నాయి.

**తృణధాన్యాలు**



వీటిలో ఫైబర్, ఖనిజాలు, విటమిన్లు అధికంగా ఉంటాయి. తృణధాన్యాలు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడతాయి.



నినాదం మార్కెట్

# కారుపై భారీ డిస్కౌంట్లు

## ప్రకటించిన కంపెనీలు




ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్ల సమాఖ్య (ఎఫ్ఏడీఏ) తెలిపిన వివ రాలప్రకారం.. దేశంలో కార్లమార్కెట్ ఆశాజనకంగా లేదు. దాదాపు అన్ని కంపెనీ వాహనాల విక్రయాలు తగ్గిపో యాయి.

గతేడాదితో పోల్చితే 2025 ఫిబ్రవరిలో వాహనాల అమ్మకాలు దాదాపు 7.19 శాతం తగ్గిపోయాయి. ఇక ప్యాసింజర్ కార్ల అమ్మకాలు 10.34శాతం తగ్గుదలనుచవిచూశాయి. ప్రధానంగా హ్యుందాయ్ కంపెనీ మార్కెట్ తీవ్రంగా దెబ్బ తింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో 38,156 యూనిట్ల విక్రయంతో దేశ కార్ల మార్కెట్‌లో నాలుగో స్థానానికి పడిపో యింది. మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ తర్వా త స్థానంలో నిలిచింది. జనవరిలో జరి గిన 59,858 యూనిట్ల అమ్మకాలతో పోల్చితే దాదాపు 36 శాతం భారీ తగ్గుదల అని చెప్పవచ్చు.

సూపర్ డిలైట్ మార్చ్ ద్వారా హ్యుందాయ్ తన కార్లపై భారీ తగ్గింపులు అందజేస్తోంది. హ్యుందాయ్ వెన్యూపై రూ.55 వేలు, ఎక్స్‌టర్‌పై రూ.35 వేలు, ఐ20పై రూ.50 వేలు, గ్రాండ్ ఐ10 నియోస్ పై రూ.53 వేల తగ్గింపు అందజేస్తోంది. హ్యుందాయ్ సీవోవో తరుణ్ గార్గ్ మాట్లాడుతూ ఈ ఆఫర్ల ద్వారా హ్యుందాయ్ కార్లను తక్కువ ధరకు కస్టమర్లు సొంతం చేసుకోవచ్చన్నారు. వీటిని కేవలం డిస్కౌంట్‌గా కాకుండా ఒక పండగలా చూడాలన్నారు. మార్కెట్ లో తగ్గిన తన స్థానాన్ని పెంచుకోవడానికి హ్యుందాయ్ చేస్తున్న ప్రయత్నంలో భాగంగా ఈ డిస్కౌంట్లు ప్రకటించిందని నిపుణులు భావిస్తున్నారు. ఎందుకంటే స్టాక్ మార్కెట్‌దాదాపు ఐదు నెలలుగా క్షీణించింది. దీంతో కార్ల కొనుగోలు వంటి పెద్ద ఖర్చులకు ప్రజలు దూరంగా ఉంటున్నారు. దీనికి తోడు డీలర్ స్టాక్ స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉన్నాయి. త్వరలో హెూలీ, గుడి పద్వా వంటి పండగలు రానున్నాయి. దీంతో కార్ల విక్రయాలు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

ఎఫ్ఏడీఏ చేసిన సర్వే ప్రకారం సుమారు 45 శాతం డీలర్లు ఈ పండగల్లో కార్ల విక్రయాలు పెరుగుతాయని ఆశిస్తున్నారు. హ్యుందాయ్‌తోపాటు పలు కంపెనీలు కూడా తమ కార్లపై డిస్కౌంట్లు ప్రకటించాయి. స్కోడా ఆటో ఇండియా తన కుషాక్, స్లావియా, కైలాక్ మోడళ్లపై ఆఫర్లు ప్రకటించింది. ఒక ఏడాదది నిర్వహణ ప్యాకేజీ, పొడిగింపు వారెంటీలను తెచ్చింది.

# భారీగా పడిపోయిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు..!

## 52 వారాల కనిష్ఠానికి చేరిన షేర్ ధర..!


వరుసగా ఐదోరోజు ఇండస్ ఇండ్ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోయాయి. ఉదయం ట్రేడింగ్‌లో బ్యాంక్ షేర్లు 25శాతం తగ్గాయి. ప్రైవేటురంగ బ్యాంక్ డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో అవకతవకలను గుర్తించిన నేపథ్యంలో షేర్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మంగళవారం ఉదయం ఇండస్‌ఇండ్ షేర్లు మధ్యాహ్నం 1.45 గంటలకు రూ.226.90 తగ్గి ఒక్కో షేరు ధర రూ.673.60 చేరి.. 52 వారాల కనిష్ఠానికి చేరుకుంది. అదే సమయంలో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో కంపెనీ షేరు రూ.227.70 తగ్గి.. ఒక్కో షేరుకు రూ.673కి చేరింది. సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోకు సంబంధించిన ప్రక్రియల అంతర్గత సమీక్ష సందర్భంగా ఖాతాల బ్యాలెన్స్‌లో కొన్ని వ్యత్యాసాలను గుర్తించినట్లు ఇండస్‌ఇండ్ బ్యాంక్ పేర్కొంది




ఐపీఓ బాటలో

# ఏథర్ ఎనర్జీ..

## వచ్చే నెలలోనే ప్రారంభం..?




ఇటీవల యాక్సెస్ చేసిన కంపెనీల రిజిస్ట్రార్ (ఆర్ఓసీ) ఫైలింగ్ ప్రకారం కంపెనీ డైరెక్టర్ల బోర్డు మార్చి 8, 2025న ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రూ.1.73 కోట్లకు పైగా బకాయి ఉన్న సీసీపీఎస్‌లను రూ.24.04 కోట్ల పూర్తిగా చెల్లించిన ఈక్విటీ షేర్లుగా మార్చడానికి ఆమోదం తెలిపింది.

ఒక్కొక్కటి కేవలం రూ.1 ఫేస్ వ్యాల్యూ కలిగిన ఈ షేర్లు, ప్రస్తుత ఈక్విటీ షేర్లతో సమానంగా ఉంటాయి. సీసీపీఎస్ అనేవి ఒక రకమైన ప్రిఫరెన్స్ షేర్లు, వీటిని ఒక నిర్దిష్ట వ్యవధి తర్వాత లేదా కొన్ని సంఘటనలు జరిగిన తర్వాత ఈక్విటీ షేర్లుగా మార్చాలి. మార్చిన సీసీపీఎస్‌లలో కాలక్రమేణా జారీ చేసిన బహుళ సిరీస్‌లు ఉన్నాయి. అవి సిరీస్ సీడ్ (ఒకటి నుంచి నాలుగు), సిరీస్ ఏ నుంచి జీ, బోనస్ సీసీపీఎస్ వంటి అదనపు సిరీస్‌లు, వివిధ ఈ క్లాసెస్ (ఈ, ఈ1, ఈ2)గా ఉంటాయని నిపుణ్నుల వెల్లడిస్తున్నారు. సెబీ ఇష్యూ ఆఫ్ క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్మెంట్స్ (ఐసీడీఆర్) నిబంధనల ప్రకారం మార్కెట్ రెగ్యులేటర్‌కు రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్‌పీ) దాఖలు చేయడానికి ముందు అన్ని సీసీపీఎస్‌లను ఈక్విటీగా మార్చాలి.

ఏథర్ ఎనర్జీ తన బకాయి ఉన్న సీసీపీఎస్‌లను ఈక్విటీగా మార్చాలనే నిర్ణయం, కంపెనీ తన పబ్లిక్ ఇష్యూ వైపు వేగంగా పురోగమిస్తోందని సూచిస్తుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించే మొదటి వాటిలో ఒకటి కావచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన కర్మాగారాన్ని ఏర్పాటు చేయడానికి, రుణ తగ్గింపునకు నిధులను సేకరించడానికి ఏథర్ ముసాయిదా పత్రాలను దాఖలు చేసింది. డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్పీ) ప్రకారం ఐపీఓలో రూ. 3,100 కోట్ల విలువైన ఈక్విటీ షేర్ల తాజా ఇష్యూ, ప్రమోటర్లు, పెట్టుబడిదారుల ద్వారా 2.2 కోట్ల ఈక్విటీ షేర్ల ఆఫర్-ఫర్-సేల్ కలయిక ఉంటుంది. ఏథర్ ఎనర్జీ ఐపీఓను ప్రారంభిస్తే గత ఏడాది ఆగస్టులో భవిష్ అగర్వాల్‌కు చెందిన ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ రూ.6,145 కోట్ల ఐపీఓను విడుదల చేసిన తర్వాత పబ్లిక్‌గా విక్రయించబడుతున్న రెండవ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన సంస్థ అవుతుంది. 20 సంవత్సరాలకు పైగా దేశంలో ఒక ఆటోమేకర్ చేసిన మొదటి ఇష్యూ కూడా ఇదే అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఓలా ఎలక్ట్రిక్‌కు సంబంధించిన ఐపీఓలో రూ. 5,500 కోట్ల తాజా ఇష్యూ, 8.4 కోట్ల షేర్ల ఆఫర్ ఫర్ సేల్ ఉన్నాయి.

# త్వరలో భారత్‌లో ఎలాన్ మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్..

స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్‌నెట్‌ను భారత్‌కు తీసుకువచ్చేందుకు ఎయిర్‌టెల్ ఎలాన్ మస్క్ కంపెనీ స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ పేర్కొంది. దాంతో తమ యూజర్లకు స్టార్‌లింక్ హైస్పీడ్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించనున్నట్లు చెప్పింది. అయితే, స్టార్‌లింక్ శాటిలైట్ కమ్యూనికేసన్ సేవలకు కేంద్రం అనుమతి ఇస్తేనే ఈ ఒప్పందం అమలు ఆధారపడి ఉంటుందని ఎయిర్‌టెల్ వెల్లడించింది. భారత్‌లోని యూజర్లకు స్టార్‌లింక్ సేవలను అందించేందుకు స్పేస్‌ఎక్స్‌తో కలిసి పని

## స్పేస్‌ఎక్స్‌తో ఎయిర్‌టెల్

చేయడం ఓ కీలకమైన మైలురాయని, తర్వాతి తరం శాటిలైట్ కనెక్టివిటీని యూజర్లకు అందించాలనే తమ నిబద్ధతకు ఇది తార్కాణమని ఎయిర్‌టెల్ ఎండీ, వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ పేర్కొన్నారు. స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం నేపథ్యంలో భారత్‌లోని మారుమూల ప్రాంతాలకు సైతం హైస్పీడ్ బ్రాడ్ బ్యాండ్ సేవలు అందించే సామర్థ్యం ఎయిర్ టెల్‌కు కలుగుతుంది. దాంతో ప్రతి వ్యక్తికి, వ్యా పారాలకు, కమ్యూ నిటీలకు




వేగవంతమైన ఇంటర్నెట్ లభిస్తుంది. ఒప్పందం మేరకు ఎయిర్‌టెల్ రిటైల్‌స్టోర్స్‌లో స్టార్‌లింక్ పరికరాలు అందుబాటులోకి ఉంటాయి. ఎయిర్‌టెల్ స్టోర్స్‌లో స్టార్‌లింక్ పరినికరాలను విక్రయిస్తారు.

వాటితో ఎయిర్‌టెల్ విని యోగదారులకు నేరుగా స్టార్‌లింక్ బ్రాడ్ బ్యాండ్ సేవలు అందనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ సేవలు అందుతాయని విట్టల్ పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ ఇప్పటికే శాటి లైట్ ఇంటర్నెట్‌ను అందిస్తోంది. యూటెల్‌సాట్ వన్‌వెబ్‌తో భాగస్వామ్యంతో ఇంటర్నెట్ సేవ లను అందిస్తున్నది. తాజాగా స్టార్‌లింక్‌తో ఒప్పందం నేపథ్యంలో మారుమూల ప్రాంతాలకు ఇంటర్నెట్ కవరేజ్ విస్తరించనుంది.

# జాతీయ స్థాయి కుంగ్ ఫూ.. కరాటే పోటీలలో జిల్లా విద్యార్థులు

- 4 బంగారు పతకాలు, 2 వెండి పతకాలు
- విద్యార్థులను అభినందించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష



**పెద్దపల్లి, మార్చి11 (నినాదం) :** జాతీయ స్థాయి కుంగ్ ఫూ,కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష మాట్లాడుతూ, మార్చ్ 9న పెద్దపల్లి జిల్లాలోని ఎంబీ గార్డెన్స్ లో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ కుంగ్ ఫూ,కరాటే ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. జాతీయ స్థాయి ఓపెన్ ఛాంపియన్షిప్ 2025 పోటీలలో పెద్దపల్లి జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు.వివిధ కేటగిరీలలో 4 బంగారు పతకాలు,2 వెండి పతకాలు సాధించారని అన్నారు.కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని వెన్నంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు మూడు బంగారు పథకాలు, కూనారం పాఠశాల విద్యార్థులకు ఒక బంగారు పతకం, మంగపేట పాఠశాల విద్యార్థులకు రెండు వెండి పథకాలు వచ్చాయని తెలిపారు.జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు.విద్యార్థినులకు కరాటే, కుంగ్ ఫూ,పై శిక్షణ అందించిన మాస్టర్లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే కుంగ్ ఫు, మాస్టర్,విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు నిధులు మంజూరు

- పాలాభిషేకం చేసిన గ్రామస్తులు, విద్యార్థిల తల్లిదండ్రులు

**చెన్నూర్, మార్చి11 (నినాదం న్యూస్):** చెన్నూర్ మండలంలోని సోమన పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు నిధులు మంజూరు చేయించిన చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు. నిధులు విడుదల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల శిలాఫలకం వద్ద సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీ కృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు. కాంప్లెక్స్ భావణాల నిర్మాణం కోసం 200 కోట్ల రూపాయలు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు... ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కు ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు...ం

## అమ్మ.. నన్ను క్షమించు

- పెళ్లి ఇష్టం లేక యువతి బలవన్మరణం



**మంచిర్యాల ప్రతినిధి, మార్చి 11(నినాదం న్యూస్):** అమ్మ ..నన్ను క్షమించు.. నీవు చిన్నతనం నుంచి తండ్రి లేకున్నా అల్లారుముద్దుగా పెంచావు. కానీ నేను భవిష్యత్తులో ఉన్నత స్థానంలో నిలిచి నిన్ను ప్రేమగా చూసుకోవాలని కలలు కన్నాను. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక నిన్ను విడిచి వెళ్ళిపోతున్న అంటూ ఓ యువతి సూసైడ్ లేఖ రాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అందరినీ కంటతడి పెట్టింది. పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శ్రీరాంపూర్ లో చోటుచేసుకుంది. ఎస్ఐ సంతోష్ తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీరాంపూర్ లోని లక్ష్మీ నగర్ చెందిన మెరుగు మల్లయ్య-కీర్తన దంపతుల రెండవ కూతురు సౌమ్య (23) డిగ్రీ పూర్తి చేసింది. హైదరాబాద్ లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంది. తండ్రి చిన్నతనంలో మృతి చెందడంతో తల్లి కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుంది. కుటుంబ సభ్యులు సౌమ్యకు వివాహ సంబంధాలు చూస్తున్నారు. కానీ అమ్మాయికి మాత్రం పెళ్లి కన్నా జీవితంలో సెటిల్ కావాలని మక్కువ ఎక్కువ ఉండేది. అయినప్పటికీ కుటుంబ సభ్యులు పెళ్లి సంబంధాలు చూస్తూనే ఉన్నారు. దీంతో ఆమెకు పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక మనస్తాపం కి గురైంది. సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి కీర్తన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

## అంత మా ఇష్టం.. అడిగే వారెవరు


- సమయ పాలన పాటించని వ్యవసాయ అధికారులు
- ఉదయం 11:30 గంటలకు తాళం వేసి ఉన్న వ్యవసాయ కార్యాలయం






**సుల్తానాబాద్, మార్చి 11(నినాదం న్యూస్) :** రైతు ప్రభుత్వంలో రైతులకు సేవ చేయాల్సిన వ్య వసాయ ఉద్యోగులు మాత్రం సమయపాలన పా టించకుండా పూర్తి గా నిర్లక్ష్యం వహిస్తున్నారు.ప్ర భుత్వ కార్యాలయమే కదా అంతా మా ఇష్టం, అ డిగే వారెవరు అన్న రీతిలో ఉద్యోగులు ఉండడం ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది. మంగళవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని మినీ కలెక్టరేట్ లో ఉన్న వ్యవసాయ కార్యాలయం ఉదయం 11:30 అవు తున్నతాళం వేసి ఉండడం పట్ల,వివిధ పనుల కో సం వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆ గ్రహం వ్యక్తంచేస్తున్నారు.దీనిబట్టిచూస్తుంటే విధు ల నిర్వహణలో సిబ్బంది చిత్తశుద్ధి ఏ మేరకు ఉం దో అర్థమ వుతుంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోసిబ్బంది ఇష్టారా జ్యంగా వ్యవహరిస్తున్నారు అని విమర్శలు వినబడు తున్నాయి. ఇప్పటికైనా సమయం పాలన పాటించేలా చూడాలని పై అధికారు లను ప్రజలు కోరుతున్నారు.

## ఆకారణంగా తొలగించారు



**మంథని, మార్చి11 (నినాదం న్యూస్):** మంథని మండలంలోని గోపాల్ పూర్ గ్రామ వసుంధర గ్రామైక్య సంఘము నకు విఓఎ గా పనిచేస్తున్న గొరిగే జయసుధ అనే నన్ను ఆకరణంగా తొలగించారని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు కొంతమంది నేనంటే గిట్టని వారు ఫిర్యాదు చేశారని, పెద్దపల్లి డిఆర్డిఏ నుండి ఎలాంటి విచారణ చేయకుండానే విధుల నుండి తొలగించారని వివోఏ జయసుధ వాపోయారు. నేను ఎలాంటి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని ఆమె తెలిపారు. నేనంటే పట్టనీ వారు ఎలాంటి ఆధారం లేకుండా చేసిన ఆరోపణలు పరిగణించి నన్ను ఉద్యోగం నుండి తొలగించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వివోఏ నాలుగు నెలల జీతం రూ. 20 వేల పడగానే గౌతమి మండల సమైక్య అధికారి, ఏపిఎం పద్మ చెక్ బుక్స్ దగ్గర పెట్టుకొని రూ. 15 వేలు ఏదో స్కూటీ స్కీమ్ అని కలిమి స్వర్ణలత అనే మహిళకు ఫోన్ పే ద్వారా పంపించమని ఒత్తిడి చేసి ఐకెపి ఆఫీసులో ఏడుగురు మంది ఐకెపి ఎపిఎం పద్మకు తల రూ.15వేల కట్టడంతో ఏపిఎం పద్మకు స్కూటీ వచ్చిందని వివోఏ తెలిపారు. నా ఆరోగ్యం బాగా లేనందున నా డబ్బులు రూ.15 వేల నాకు కావాలని అడిగితే నన్ను డబ్బులు అడుగుతావని అని నన్ను టార్గెట్ చేసి నాపైన కోపంగా ఇవన్నీ చేస్తుందని పై అధికారులు వీటీపై విచారణ జరిపి నాకు ఉద్యోగం ఇప్పించాలని ఎలాంటి విచారణ కైనా నేను సిద్ధంగా ఉన్నానని వివోఏ జయసుధ తెలిపారు. పేద గిరిజన మహిళనైన నాపై అకారణంగా ఆరోపణలు చేస్తూ తొలగించిన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఉద్యోగం మళ్ళీ ఇప్పించాలని ఆమె కోరారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత

**మంచిర్యాల ప్రతినిధి, మార్చి11(నినాదం న్యూస్) :** డీసీఎం వ్యానులో అక్రమంగా రవాణా చేస్తున్న 71 క్వింటాళ్ళ పిడిఎస్ రైస్ ను టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. శ్రీరాంపూర్ అరుణాక్కర్ నగర్ కు చెందిన పాస్తం శ్రీనివాస్ (34)మంచిర్యాల జిల్లా నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నస్పూర్ నుంచి కాగజ్ నగర్ వైపుగా డీసీఎం ద్వారా అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారు. టాస్క్ ఫోర్స్ సిఐ రాజ్ కుమార్, ఎస్సై ఉపేందర్ ఆధ్వర్యంలో రాంనగర్ వద్ద వాహనాలు తనిఖీ చేయగా డీసీఎం వ్యానులో తరలిస్తున్న సుమారు 71 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది. పిడిఎస్ రైస్, డీసీఎం మరియు నిందితుడిని తదుపరి



విచారణ నిమిత్తం నస్పూర్ ఎస్ఐ గారికీ అప్పగించడం జరిగింది.

# ఎన్టీపీసీలో భద్రతకు అధిక ప్రాధాన్యం

- 'వికసిత్ భారత్' పారిశ్రామిక రంగం అభివృద్ధిలో కీలక పాత్ర
- ప్రతి ఉద్యోగి, కార్మికుడు సంస్థ మనుగడ కోసం పనిచేయాలి
- సమిష్టి కృషితో ఎన్నో అవార్డులు సాధించగలం
- ఎన్టీపీసీ ప్రాజెక్టు హెడ్ చందన్ కుమార్ సమంత





**గోదావరిఖని, మార్చి11(నినాదం న్యూస్) :** ఎన్టీపిసిలో భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎన్టీపిసి ప్రాజెక్టు హెడ్ చందన్ కుమార్ సమంత తెలిపారు. ఈ మేరకు మంగళవారం రామగుండం, తెలంగాణ 54వ జాతీయ భద్రత వారోత్సవపు ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ హెడ్ సమంత మాట్లాడుతూ,వికసిత్ భారత్ పారిశ్రామిక రంగం అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉద్యోగి, కార్మికుడు సంస్థ మనుగడ కోసం పనిచేయాలి అని సూచించారు. సమిష్టి కృషితో అవార్డులు సాధ్యమని అన్నారు. ఈ సందర్భంగా సేఫ్టీ డిజిఎమ్ బహేకర్ స్వాగతం పలికి, ఏజీఎం చక్రవర్తి భద్రత నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు భద్రతా యొక్క ప్రాము ఖ్యతను, భద్రత సంస్కృతిని క్లుప్తంగా వివరించారు.

# నూతన జేసీబీ యంత్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని మార్చి 11 (నినాదం న్యూస్) :** కార్పొరేషన్ ఆధ్వర్యంలో 76 లక్షల వ్యయంతో తెప్పించిన రెండు జెసిబి యంత్రాలను, 5 లక్షల వ్యయంతో తెప్పించిన ఎనిమిది ఫాగింగ్ యంత్రాలను ఎమ్మెల్యే, జిల్లా అదనపు కలెక్టర్ అరుణ శ్రీ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేషన్ ను అప్పుల పాలు చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉందన్నారు. గత 20 సంవత్సరాలు వేరు ఇప్పుడున్న ఏడాది పరిపాలన వేరని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తుందని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీ,



మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఉన్నారు.

# 436 రూపాయల ప్రీమియంతో 2 లక్షల బీమా

- పీఎంజేజేబీవై పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- 18 నుంచి 50 సంవత్సరాల వయసు వారు ఈ పథకంలో చేరవచ్చు
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష

**పెద్దపల్లి, మార్చి11(నినాదం) :** ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంకు ద్వారా 436 రూపాయల ప్రీమియం తో 2 లక్షల బీమా లభిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.మంగళవారం కలెక్టరేట్ లో తన చాంబర్ లో పి.ఎం.జే.జే.బి.వై పథకం కింద సంబంధిత కుటుంబ సభ్యులకు రెండు లక్షల రూపాయల చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన క్రింద గత 2 సంవత్సరాలలో పెద్దపల్లి జిల్లా ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ బ్రాంచ్ ద్వారా 20 మందికి బీమా క్లెయిమ్ సెటిల్ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల వయసు ఉన్నవారు సంవత్సరానికి 436 రూపాయల ప్రీమియం చెల్లించి పి.ఎం.జే.జే.బి.వై లో చేరవచ్చని,55 సం,రాల వయసు వరకు ప్రీమియం రెన్యువల్ చేసుకోవచ్చని తెలిపారు. బీమా కట్టిన వారు సాధారణంగా 30 రోజుల తరువాత మరణిస్తే , ప్రమాదవశాత్తు 24 గంటల తరువాత



మరణిస్తే దరఖాస్తు చేసుకున్న 5 పని దినాలలో రెండు లక్షల రూపాయల బీమా సొమ్ము అందించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రజలంతా పి.ఎం.జే.జే.బి.వై పథకాన్ని వినియోగించుకోవాలని తప్పనిసరిగా ప్రీమియం చెల్లించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి లీడ్ బ్యాంకు మేనేజర్ వెంకటేష్,ఇండియన్ పోస్ట్ పేమెంట్ సీనియర్ మేనేజర్ కొట్టే శ్రీనివాస్ ,మేనేజర్ మోహన్ సాయి,తదితరులు పాల్గొన్నారు.

# రామగుండం రూపురేఖలు మారుస్తా

- రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్




**గోదావరిఖని, మార్చి11 (నినాదం న్యూస్) :** గోదావరిఖని లక్ష్మీ నగర్ లో 15 కోట్ల నిధులతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ కార్యక్రమం నిర్వ హించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రామ గుండం రూపురేకలు మారుస్తా, బొందల గడ్డలా మారుతున్న పారిశ్రామిక ప్రాంతాన్ని ప్రభుత్వం సింగరేణి యాజ మాన్యం సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.ఇదే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లతో కలిసి వారి సలహాలతో నగరాన్ని పునర్




వైభవాన్ని తీసుకొస్తామని అన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడ ఎవరిని ఇబ్బందులు పెట్టడం లేదని అన్నారు. అంతే కాకుండా అర్హత కలిగిన స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు.అలాగే సింగరేణి స్థలాలను ఆక్రమించుకున్న వారి నుంచి భూములను తీసుకుంటున్నామని అన్నారు. ఈ సందర్భంగా షాపింగ్ కాంప్లెక్స్ సంబంధించిన ఇప్పటికే డిజైన్ పూర్తి చేశామని, ఇందుకు ప్రజలు వ్యాపారులు సహకరించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాగూర్, ఆర్జీవన్ జిఎం లలిత్ కుమార్, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

## కోర్టు ఇచ్చిన తీర్పు హర్షనీయం..



**మంథని, మార్చి11 (నినాదం న్యూస్) :** ప్రణయ్ హత్య కేసు విషయంలో నల్గొండ జిల్లా కోర్టు ఇచ్చిన సంచలన తీర్పు పట్ల ప్రజాసంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.మంగళవారం మంథని అంబేద్కర్ చౌరస్తాలో ప్రేమికులు ప్రణయ్ అమృతల చిత్రపటాలను ప్రదర్శిస్తూ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల క్రితం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో కులాంతర వివాహం చేసుకున్న ప్రణయ్ ని అతికిరాతకంగా హత్య చేశారని ఈ విషయంలో జిల్లా కోర్టు సంచలన తీర్పునిస్తూ 1 నిందితుడు మారుతి రావు గతంలోనే ఆత్మహత్య చేసుకున్నాడని 2 నిందితునికి ఉరిశిక్ష విధిస్తూ మిగతా ఆరుగురి నిందితులకు యావజీవ శిక్ష విధిస్తూ తీర్పునిచ్చిందని ఇట్టి తీర్పును స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కోర్టు తీర్పు కులదూరంకారులకు చెంప పెట్టని ఇప్పటికైనా వారికి కనువిప్పు కలుగాలని కోరారు. అదే విధంగా గతంలో మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో మంథని మధుకర్ ప్రేమ వ్యవహారంలో పరువు హత్యకు గురయ్యాడని రీ పోస్టుమార్టం రిపోర్టును కోర్టు బహిర్గతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రగోతం రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రెంకాల సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాబు రవి, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మంథని లింగయ్య, కాంగ్రెస్ నాయకులు బూడిద తిరుపతి, బెజ్జంకి దిగంబర్, అజీమ్ ఖాన్, షరీఫ్ ఉద్దీన్, నాయకులు ఇరుగురాల ప్రసాద్, లు పాల్గొన్నారు

## రామగుండం నూతన సీపీకి శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నేతలు..!



**గోదావరిఖని, ఫిబ్రవరి11 (నినాదం న్యూస్):** రామగుండం నూతన కమిషనర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అంబర్ కిషోర్ ఝూ ని రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో బీజేపీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి కమిషనర్ కి పుష్పగుచ్ఛం అందించి,శాలువాతో సన్మానించారు.రామగుండం ప్రాంత అభివృద్ధికి మరియు శాంతి భద్రతల పరిరక్షణకు సంపూర్ణ సహకారం అందిస్తామని, నగరంలో ప్రజాసమస్యల పరిష్కారంలో బీజేపీ పూర్తి సహకారం అందిస్తుందని కందుల సంధ్యారాణి గారు తెలియజేశారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి,తోట కుమారస్వామి మండల అధ్య క్షులు మిట్టపల్లి సతీష్ ,గుండబోయిన భూమయ్య,కోడూరి రమేష్, సిలువేరు అంజి పాల్గొని, కమిషనర్ గారికి శుభాకాంక్షలు తెలిపారు.

## మాదక ద్రావ్యాలపై అవగాహన సదస్సు



**మంథని, మార్చి 11 (నినాదం న్యూస్):** ముత్తారం మండలం కేశనపల్లి గ్రామంలో మంగళవారం ఎస్సై గొప్పతి నరేష్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాలు, సీసీ కెమెరాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రాజ్ గౌడ్ మాట్లాడుతూ ఆపద వచ్చిన అత్యవసర సమయంలో డయల్ 100 ను ఉపయోగించు కోవాలని సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలాన్నారు. ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. భవిష్యత్తును నిర్ణయించే యువత గంజాయి, మాదకద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, వాటికి అలవాటు పడిన యువత డబ్బు కోసం నేరాల వైపు వెళ్లి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, గ్రామంలో ఎవరైనా గంజాయి ఇతర మాదకద్రవ్యాలు వాడుతున్న, సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన పోలీసు వారికి సమాచారం అందించాలని అన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

**మంథని మార్చి 11( నినాదం న్యూస్):** ఎప్రిల్ 15న మంథని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో 1975 సం లో ఇంటర్మీడియట్ చదువుకున్న బ్యాచ్ వారి స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి కోరారు. మంగళవారం మంథని పూర్వ విద్యార్థి యువత కార్యాలయంలో చంద్రుపట్ల సుధాకర్ రెడ్డి అధ్యక్షతన పోరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిధి గా పాల్గొన్నారు. ఎప్రిల్ 15 వ తేదీన నిర్వహించే స్వర్ణోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ ఆనాటి విద్యార్థులు మూడున్నర దశబ్దాల అపూర్వ సమ్మేళనం జరిగిన వైభవం గూర్చి వక్తలు ప్రశంషించారు. 250 మంది చదువుకున్న ఆనాటి విద్యార్థులు స్వర్ణోత్సవాలలో కుటుంబ సభ్యులతో హాజరు కావాలని నిర్ణయించారు. సమావేశంలో కోమురోజు శ్రీనివాస్, అంబటి నర్సింగరావు,బోగోజు శ్రీనివాస్, షరీఫోద్దీన్, నారమల్లకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో ఎంపీ గడ్డం వంశీ కృష్ణ భేటీ

## అభివృద్ధి నిధులపై చర్చ





పెద్దపల్లి రూరల్ మార్చి 11(నినాదం): ద్దపల్లి పార్లమెంటు సభ్యుడు గడ్డం వంశీ కృష్ణ కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీతో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, చామల కిరణ్,రఘురామ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన కేంద్ర నిధుల కేటాయింపు, పెద్దపల్లి నియోజకవర్గం అభివృద్ధి పనులపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలోని అభివృద్ధి నిధుల ప్రాధాన్యత రాష్ట్రానికి మరిన్ని నిధులు కేటాయించాలని, ప్రత్యేకించి పెద్దపల్లి నియోజకవర్గంలో మౌలిక వనరుల అభివృద్ధికి కేంద్రమంత్రిని,ఎంపీ గడ్డం వంశీ కృష్ణ అభ్యర్థించారు. ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టులు,రోడ్డు విస్తరణ,రైల్వే మార్గ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతి,విద్యామౌలికసదుపాయాల పెంపు వంటిఅంశాలపై ప్రధానంగా చర్చించారు.కేంద్రసహాయ నిధుల పెంపు కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెద్దపల్లిపార్లమెంటు అభివృద్ధికి మరింత మద్దతు అందించాల్సిన అవసరాన్ని హైలైట్ చేశారు.రోడ్లు,రవాణా వ్యవస్థ అభివృద్ధిజాతీయ రహదారులు, గ్రామీణ రహదారుల అభివృద్ధి,కొత్తరవాణా ప్రాజెక్టులు వంటికీలకఅంశాలపై మంత్రితో చర్చజరిపారు. ఎంపీ వంశీకృష్ణ పెద్దపల్లి ప్రజ లకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్‌హెచ్ 63విస్తరణ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని, భూసేకరణ ప్రక్రియను పూర్తిచేసి నష్టపోయిన రైతులకు తగినపరిహారం అందిం చాలనికోరారు. అదనంగా నేషనల్ హైవేలో కూనారం గ్రామం వద్ద అసిస్‌పాయింట్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించి మంజూరును కోరారు.

### పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

# దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు



ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీల కేటగిరి 2 పీహెచ్‌డీ సీట్ల భర్తీకి నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు గడువును పొడిగించినట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. రూ. 2000 అపరాధ రుసుముతో ఈనెల 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చేనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

### కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, మార్చి 11(నినాదం న్యూస్): పాఠశాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులలో కంటి అద్దాలు అవసర మైన వారికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగ ళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్‌గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 20 మంది విద్యార్థులకు జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్‌తో కలిసి కంటి అద్దాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 568 పాఠ శాలలు ఉండగా ఇందులో 164రెసిడెన్షియల్ పాఠశాలలలో 8ఆర్.బి.ఎస్.కె. బృందాల ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 1274 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. వీరందరికీ కంటి వైద్య నిపుణులు ద్వారా ఫిబ్రవరి నెలలో ప్రభుత్వాసుపత్రిలో తిరిగి పరీక్షలు నిర్వహించి అద్దాల కోసం వివరాలు పంపిం చడంజరిగిందని తెలిపారు. కంటిసమస్యలతో బాధపడుతున్న వారిని బృందాల ద్వారా గుర్తించి కంటివైద్య నిపుణుల ద్వారా పరీక్షలు చేసి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని, కంటి అద్దాలను తప్పనిసరిగా వినియోగించాలని తెలిపారు. కంటి సమస్యలు రాకుండా ప్రతి ఒక్కరూ ఆహార అలవాట్లు మార్చుకోవాలని, ఏదైనా కంటి సమస్యలు ఉన్నట్లయితే ఆర్.బి.ఎస్.కె.బృందాల ద్వారా గుర్తించి ప్రభుత్వపరంగా చికిత్సలు పొందాలని తెలిపారు. ప్రతిఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు, వేసవికాలంలో వడదెబ్బ నుండి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ఓ.ఆర్.ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. జిల్లాలోని 1241 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది

### కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, మర్చి 11(నినాదం న్యూస్): కరీంనగర్ జిల్లా టీఎన్జీవోల సంఘం సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఆటల పోటీలు, వైద్యఆరోగ్యశాఖ సౌజన్యంతో ఆరోగ్య మహిళ వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి ప్రత్యేక చొరవతో వైద్య ఆరోగ్యశాఖ సౌజన్యంతో ఆరోగ్య మహిళ వైద్య శిబిరాన్ని తమ చేతులతో ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం చాలా ముఖ్యమని మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం ఆరోగ్యంగా ఉంటుందని కుటుంబం ఆరోగ్యంగా ఉంటేనే సమాజం దేశం ఆరోగ్యమైన వాతావరణంలో బతుకుతుందని అట్టి మహిళల ఆరోగ్యం చాలా ముఖ్యమని మహిళలే ఆది గురువు అని మహిళలకు సంబంధించిన ప్రతివిషయంలో పురుషులు బాధ్యతాయుతంగా ప్రవర్తించి నవ సమాజానికి నిర్మాణం కోసం పాటుపడాలని కోరారు. ఆదే విధంగా గర్భిణీలకు పౌష్టికాహారం.

ఆరోగ్య మహిళా వైద్య శిబిరం ప్రతి మంగళవారం రోజున వివిధ ప్రాంతాల్లో పెట్టడం జరుగుతుందని ప్రభుత్వ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకమైన ఆట పోటీలను కూడా కలెక్టర్ ప్రారంభించారు. ఆటల పోటీల్లో భాగంగా మహిళలకు డాడ్జ్ బాల్ స్కిప్పింగ్ టగ్-ఆఫ్-వార్ త్రోబాల్, బెలూన్ గేమ్ నిర్వహించడం జరిగింది.

కార్యక్రమంలో వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించి సుమారుగా 500 మంది మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గెలుపొందిన మహిళలందరికీ సాయంత్రం 5గంటలకు కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా న్యాయమూర్తి ప్రతిమ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఎంప్లాయిస్ చైర్మన్ ఎన్జీవోల సంఘం అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి కార్యదర్శి సంగేం లక్ష్మణ్ రావు టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్ కార్యదర్శి డాక్టర్ యెడ్ల అరవింద్ రెడ్డి కేంద్ర సంఘం నాయకులు నాగుల నరసింహ స్వామి గూడ ప్రభాకర్ రెడ్డి



సర్దార్ హర్మీంధర్ సింగ్ హరికృష్ణ జిల్లా సహాధ్యక్షులు ఒంటెల రవీందర్ రెడ్డి టౌన్ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్ కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు తిమ్మాపూర్ అధ్యక్షులు పోలు కిషన్ కార్యదర్శి నాగరాజు రూరల్ అధ్యక్షులు కోడూరి వాస్తవిక్ గౌడ్ కార్యదర్శి కొంమేర శ్రీనివాసరెడ్డి నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోట రామస్వామ తదితరులు పాల్గొన్నారు.

NINADAM CINEMA

### దెబ్బకొట్టిన

# క్లైమాక్స్ సెంటిమెంట్



Mahesh Babu

సూపర్ స్టార్ మహేష్ బాబుకి టాలీవుడ్‌లో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువే. ఆయన సినిమాల కోసం అభిమానులు ఎప్పుడూ ఎదురు చూస్తుంటారు. ప్రస్తుతం మహేష్.. రాజమౌళితో భారీ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ సినిమా ఎలా ఉంటుంది, ఎన్ని సంచలనాలు సృష్టిస్తుందని లెక్కలు వేసుకుంటున్నారు. అయితే తాజాగా మహేష్ మూవీ క్లైమాక్స్‌లకి సంబంధించిన ఓ వార్త నెట్టింట వైరల్ అవుతుంది. మహేష్ బాబు నటించిన బాబీ సినిమా కోసం రెండు క్లైమాక్స్‌లు షూట్ చేశారట. ఇప్పటి జనరేషన్ వాళ్లకి ఈ విషయం తెలియదు. మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ జంటగా శోభన్ దర్శకత్వంలో 2002లో బాబి సినిమా రూపొందింది. సినిమా మహేష్ నటించిన తొలి లవ్ స్టోరీ మూవీ కాగా, ఈ సినిమాకి మణిశర్మ మ్యూజిక్ అందించారు. ప్రకాష్ రాజ్, రఘువరన్, బ్రహ్మానందం, సునీల్, రవిబాబు ఇలా భారీ కాస్టింగ్ తో ఈ చిత్రాన్ని రూపొందించారు.'టక్కరి దొంగ ' లాంటి కౌబాయ్ మూవీ తరువాత మహేష్ నుండి వచ్చిన ఈ మూవీపై అభిమానులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే సినిమా రిలీజ్ అయ్యాక ఫ్యాన్స్ చాలా డిజప్పాయింట్ అయ్యారు. అందుకు కారణం క్లైమాక్స్ లో మొత్తం అందరూ చనిపోతారు. హీరో మహేష్ బాబు, హీరోయిన్ ఆర్తి అగర్వాల్ కూడా పోలీస్ కాల్పుల్లో చనిపోవడంతో సినిమా ఎండ్ అయిపోతోంది. అయితే ఇది మహేష్ ఫ్యాన్స్‌ని నిరాశకు చేసింది. పెద్ద గొడవ చేశారు. సెకండ్ షో సమయానికి డిజాస్టర్ అన్నారు. దాంతో ప్రొడక్షన్ టీం హడావుడిగా మరో చిన్న సీన్ షూట్ చేసి క్లైమాక్స్ మార్చేశారు. దాని ప్రకారం సినిమాలో ఆర్తి అగర్వాల్ తండ్రి ప్రకాష్ రాజ్ వచ్చి పోలీస్ కాల్పుల్లో గాయపడిన మహేష్ బాబు, ఆర్తి అగర్వాల్ ని హాస్పిటల్ కి తీసుకువెళ్లినట్టు చూపిస్తారు. ఇక చివరికి ఇద్దరికి పెళ్లి చేసి శుభం కార్డ్ వేస్తారు. అలా చేసిన కూడా సినిమా రిజల్ట్ మారలేదు. ఈ సినిమా రిలీజ్ అయిన మూడు నెలల గ్యాప్‌లో ఒక్కడు చిత్రం రిలీజ్ అయి మహేష్ కెరియర్‌ని పూర్తిగా మార్చి వేసింది. ఫ్యాన్స్ కు 'ఒక్కడు ' ఫుల్ మీల్స్ పెట్టేసింది. ఆ సక్సెస్ తో 'బాబీ ' గాయాన్ని మర్చిపోయారు ప్రిన్స్ అభిమానులు.





# ఒడిషాలో నటి ప్రియాంక

### రాజమౌళి సినిమాపై సర్వత్రా చర్చలు

ప్రస్తుతం ఎక్కడ చూసినా మహేశ్ బాబు, రాజమౌళి సినిమా ముచ్చట్లే వినిపిస్తున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో స్టార్ హీరో మహేశ్ బాబు నటిస్తున్న ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇందులో ప్రియాంక చోప్రా కీలకపాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ఈ నటి పంచుకుంటున్న తన అప్‌డేట్స్ క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. తాజాగా ప్రియాంక తన ఇన్‌స్టాలో కొన్ని ఫొటోలు, వీడియో పంచుకున్నారు. ఆ వీడియో చూస్తే, ఆమె ఒడిశా వెళ్లినట్లు తెలుస్తోంది. దానితో పాటు విమానం నుంచి చూస్తున్న ఓ స్టైలిష్ ఫొటోను కూడా ప్రియాంక షేర్ చేశారు.షూటింగ్ కోసమే ఆమె అక్కడకు వెళ్లినట్లు సమాచారం. మార్చి 10న విమానాశ్రయంలోని సిబ్బందితో ప్రియాంక దిగిన ఫొటో కూడా నెట్టింట వైరలైన విషయం తెలిసిందే. లార్జ్ దేన్ లైఫ్ కథలకు రాజమౌళి పెట్టింది పేరు. జక్కన్న ఏం చేసినా దాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, భారీ హంగులు అద్ది ప్రేక్షకులకు అందిస్తారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో వార్త కూడా మీడియాలో వైరల్ అవుతోంది. ఈ సినిమాలో రాజమౌళి కాశీ నగరాన్ని చూపనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే కాశీలో షూటింగ్ నిర్వహించడం కష్టం. దీంతో నిజంగా కాశీని తలపించేలా అద్భుతమైన సెట్ వేయనున్నారట. ఈ సినిమాలోని కీలక భాగం కాశీ పట్టణానికి సంబంధం ఉంటుందని అందుకే రాజమౌళి ఈ సెట్ వేయనున్నారని సమాచారం. అడవులు, నదులు, ఆధ్యాత్మిక నగరాలు.. ఇలా విభిన్న ప్రకృతి దృశ్యాలతో ప్రేక్షకులను ఎప్పటికీ మర్చిపోలేని సినిమాటిక్ అనుభూతిని అందించేందుకు రాజమౌళి సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

### మళ్లీ నటించేందుకు

# సిద్ధంగా నటి రంభ



అలనాటి నటి రంభ మరోమారు అలరించేందుకు సిద్ధమయ్యారు. త్వరలోనే తెరంగేట్రం చేసేందుకు రెడీగా ఉన్నారు. 1990ల్లో స్టార్ హీరోల సరసన నటించి మెప్పించారు నటి రంభ. ఈ నటి మరోసారి వెండి తెరపై సందడి చేయనుందంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా తమిళ నిర్మాత ఓ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ వార్తలపై స్పందించారు. ఆమె రీ ఎంట్రీ ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఫిల్మ్ ఫెస్టివల్‌లో తమిళ నిర్మాత కలైపులి ఎస్.థాను రీ ఎంట్రీ గురించి మాట్లాడారు. 'రంభ ఆర్థికంగా సెటిల్ అయ్యారు. తన భర్త కూడా పెద్ద వ్యాపారవేత్త. ఆయన ఇటీవల నన్ను కలిసినప్పుడు రంభకు మంచి సినిమాలో అవకాశం ఇవ్వమని కోరారు. అలాంటి ప్రాజెక్ట్ ఏమైనా ఉంటే కచ్చితంగా ఆమెను సంప్రదిస్తానని అతడికి హామీ ఇచ్చాను' అని చెప్పారు. దీంతో త్వరలోనే ఈ నటి రీ ఎంట్రీ ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. రాజేంద్ర ప్రసాద్ హీరోగా నటించిన 'ఆ ఒక్కటి అడక్కు' సినిమాతో టాలీవుడ్‌లో గుర్తింపు తెచ్చుకున్నారు రంభ. ఆ తర్వాత వరుసగా స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు సొంతం చేసుకున్నారు. అంతేకాదు.. దేశముదురు, యమదొంగ సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అదరగొట్టారు. ఈ పాటలు ఇప్పటికీ ట్రెండింగ్‌లో ఉన్నాయి. 2010లో కెనడాలో స్థిరపడిన ఇంద్రకుమార్‌ను వివాహం చేసుకున్నారు. దీంతో కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్నారు. నటనకు దూరంగా ఉంటున్నప్పటికీ పలు టీవీ డ్యాన్స్ షోలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరిస్తున్నారు. చివరిసారి 2008లో వెండితెరపై కనిపించారు రంభ.

### సమంతతో

# నందిని మూవీ





స్టార్ బ్యూటీ సమంత, టాలీవుడ్ స్టార్ దర్శకురాలు నందినిరెడ్డితో మళ్లీ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వీరిద్దరి కలయికలో వచ్చిన జబర్దస్త్, ఓ బేబీ చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ జోడీ మళ్లీ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో రాబోతున్నట్లు తెలుస్తోంది. సమంత సొంత ప్రొడక్షన్ అయిన ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మించే అవకాశం ఉందని సమాచారం. ఈ సినిమా రీమేక్ కాకుండా ఒరిజినల్ స్క్రిప్ట్‌తో రూపొందనుందని నందిని రెడ్డి ఇటీవల ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సినిమాల విషయానికి వస్తే.. గతేడాది సిటాడెల్: హనీ బన్నీ అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది సామ్. స్పై థ్రిల్లర్‌గా వచ్చిన ఈ వెబ్ సిరీస్‌లో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించాడు. రాజ్ అండ్ డీకే ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహించగా.. కే కే మీనన్, సికందర్ ఖేర్, సాకిబ్ సలీం తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. ఈ సిరీస్ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ అవుతుంది.

# రికార్డులు సృష్టిస్తున్న ఛావా

### బాహుబలి-2 కలెక్షన్లను అధిగమించి వసూళ్లు



విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో తెరకక్కిన 'ఛావా'రికార్డులు సృష్టిస్తోంది. ఇప్పటికే బీటౌన్‌లో ఎన్నో రికార్డులు తన ఖాతాలో వేసుకోగా.. తాజాగా మరో మైలురాయిని చేరుకుంది. సినీ ఇండస్ట్రీలో చరిత్ర సృష్టించిన 'బాహుబలి 2' రికార్డును అధిగమించింది. దీంతో విక్కీ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన 'బాహుబలి 2' అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినిమాకు గుర్తింపుతెచ్చింది. దేశవ్యాప్తంగానూ విడుదలైన అన్ని ప్రాంతాల్లో భారీ వసూళ్లు సొంతం చేసుకుంది. హిందీలో ఈ చిత్రం రూ.510 కోట్లు వసూళ్లు రాబట్టింది. ఇప్పుడీ కలెక్షన్లను 'ఛావా' అధిగమించింది. ఫిబ్రవరి 14న విడుదలైన 'ఛావా' ఇప్పటివరకూ బీ టౌన్‌లో రూ.516 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో 25 రోజుల్లోనే బాలీవుడ్‌లో 'బాహుబలి 2' రికార్డును అధిగమించి చరిత్ర సృష్టించింది. అంతేకాదు హిందీ చలనచిత్ర చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన ఆరో సినిమాగా 'ఛావా' నిలిచింది. మరోవైపు ఈ సినిమా ఓటీటీ విడుదల గురించి సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. దీని డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. థియేటర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన ఈ చిత్రం ఏప్రిల్ 11 నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలు వస్తున్నాయి . త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రానుందంటూ పోస్టులు షేర్ అవుతున్నాయి. ఈ చిత్రం ఓటీటీ విడుదలయ్యాక అక్కడ కూడా రికార్డులు నెలకొల్పడం ఖాయంగా కనిపిస్తోంది. లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో శంభాజీ మహారాజ్‌గా విక్కీ కౌశల్ ఆయన భార్య యేసుబాయి భోంస్లే పాత్రలో రష్మిక జీవించేశారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, CELL : +91 80742 79741